ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
శుక్రవారం 12 సెప్టెంబరు 2025 | 5




కొత్తపల్లి మండలంలోని కొత్తపట్నం వద్ద కోతకు గురైన ఉప్పాడ బీచ్‌రోడ్డు

తీరం అల్లకల్లోలం

- ఉప్పాడలో ఎగసిపడుతున్న రాకాసి అలలు
- కొత్తపల్లి మండలం కొత్తపట్నం వద్ద కోతకు గురైన బీచ్‌రోడ్డు
- కొత్తపట్నం ప్రాథమిక పాఠశాలలో చేరిన సముద్రపు నీరు

మెయిన్‌లో..

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహనకు.. 5కే రెడ్ రన్

- ఉత్సాహంగా పాల్గొన్న యువత
- విజేతలకు బహుమతుల అందజేత

జీజీహెచ్(కాకినాడ),సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్/హెచ్ఐవీ నియంత్రణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకునేందుకు 5కే మారథాన్ రెడ్‌రన్‌ను జిల్లావైద్యఆరోగ్యశాఖాధికారి జె.నరసింహనాయక్, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ అధికారి ఐ.ప్రభాకర్‌తో కలిసి గురువారం జెండా ఊపి ప్రారంభించారు. కాకినాడ వివేకానంద పార్క్‌వద్దనుంచి ప్రారంభమైన ఈ 5కే రన్ రామారావుపేట వరకు చేరింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ యువతలో ఎయిడ్స్/హెచ్ఐవీ వ్యాధి, లైంగికంగా సంక్రమించే ఇన్‌ఫెక్షన్‌లు, మాదకద్రవ్య వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన పెంచేందుకు జాతీయ ఎయిడ్స్ నియంత్రణలో భాగంగా జిల్లా ఎయిడ్స్/హెచ్ఐవీ విభాగం, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సమన్వయంతో జిల్లా 5కే మారథాన్ రెడ్‌రన్‌ను నిర్వహించామన్నారు. ఈ రన్‌ను ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల నుంచి 17ఏళ్ల వయస్సు నుంచి 25ఏళ్ల మధ్య వయస్సు ఉన్న విద్యార్థులకు నిర్వహించామన్నారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం అన్నివిధాలా సహకరిస్తుందని, పెన్షన్ సౌకర్యం కూడా కల్పించిందని వెల్లడించారు. హెచ్ఐవీ బాధితులకు మద్దతుతెల్పడం, వివక్షత చూపకుండా సమానంగా చూడాలనే సందేశాన్ని పంచడం ఈ రెడ్‌రన్ ప్రధాన లక్ష్యమన్నారు. ఈ రన్‌లో ప్రతి అడుగు ఒక జీవితాన్ని ప్రభావితం చేయగలదన్నారు ఈపోటీల్లో ఐడియల్ కళాశాలకు చెందిన ఆర్.శ్రీనివాస్, పి.నానిబాబులకు ప్రథమ, ద్వితీయ బహుమతులు రాగా మహిళల్లో పీఆర్ ప్రభుత్వ కళాశాలకు చెందిన సీహెచ్ అనిత, ఆదిత్య డిగ్రీ కళాశాలకు చెందిన వి.వాసంతిలకు ప్రథమ, తునికి చెందిన కె.రజియా ద్వితీయ బహుమతులు గెలుపొందారు. విజేతలకు డీఎంహెచ్‌వో ప్రథమ బహుమతికి రూ.10వేలు, ద్వితీయ బహుమతికి రూ.7వేలు, సర్టిఫికెట్‌లను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ విల్సన్, డాక్టర్ అరుణ, పి.బాలాజి, ఎ.బుజ్జిబాబు, ఎంవీ రత్నరాజు, జి.రామానాయుడు పాల్గొన్నారు.


5కే రెడ్ రన్‌ను ప్రారంభిస్తున్న జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ అధికారి ఐ.ప్రభాకర్

పెట్రో కెమి..కిల్ ఫ్యాక్టరీ!



గత వైసీపీ నిర్లక్ష్యం..గాల్లో కలిసిన ప్రాజెక్టు

- విభజన హామీగా పెట్రో కెమికల్ కాంప్లెక్స్
- రూ.32 వేల కోట్లతో ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్
- తొమ్మిదేళ్లు పూర్తయినా కదలిక లేదు
- తాజాగా నెల్లూరులో బీపీసీఎల్ ప్రాజెక్టు
- కాకినాడ పెట్రో కెమికల్ ప్రాజెక్టుపై చర్చ
- ప్రాజెక్టు జాప్యానికి బాధ్యత వైసీపీదేనన్న కేంద్రం
- నాడు బాబు పట్టుదల.. జగన్ నిర్లక్ష్యంతో మూలకు

ఒక్క ఛాన్స్ అంటే.. ఓటరు ఆలోచించాడు.. అవకాశమిచ్చాడు.. ఆ అవకాశాన్ని జగన్ దుర్వినియోగం చేశారు.. ఎంతలా అంటే అభివృద్ధి చేయాల్సిన రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి వదిలేశారు.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో ఘటనే ఇందుకు నిదర్శనం.. గత వైసీపీ విధానాలతో రాష్ట్రం అభివృద్ధిలో 20 ఏళ్లు వెనక్కు వెళ్లిపోయిందని నాయకులు అంటూనే ఉంటారు.. ఇది అక్షర సత్యం.. రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా 32 వేల కోట్ల ప్రాజెక్టు ఇస్తామంటే వదులుకుంటారా.. అధికారమిచ్చిన ఐదేళ్లు పట్టించుకోకుండా జగన్ వదిలేశారు.. ఆ ప్రాజెక్టును అతీగతీ లేకుండా చేసేశారు...ఆ కథాకమామిషు ఏమిటో తెలుసుకోవాలనుందా..!


- కాకినాడ, ఆంధ్రజ్యోతి

కాకినాడలో రూ.32 వేల కోట్లతో తొమ్మిదేళ్ల కిందట తలపెట్టిన పెట్రో కెమికల్ కాంపెక్స్ ఏర్పాటు ముగిసిన అధ్యాయంగానే కనిపిస్తోంది. ఇటీవల నెల్లూరులో రూ.లక్ష కోట్లతో బీపీసీఎల్ పెట్రో కాంప్లెక్స్ ఏర్పాటుకు వడివడిగా అడుగులు పడుతున్న నేపథ్యంలో కాకినాడ పెట్రో కాంప్లెక్స్ ఏర్పాటు వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది. ఎప్పటికైనా ఇక్కడా ఆ తరహా ప్రాజెక్టు రాకపోతుందా అనే ఆశలు తాజాగా నెల్లూరు ప్రాజెక్టుతో అడియాశలైనట్లయింది. గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో పూర్తిగా ఈ ప్రాజెక్టు మూలనపడి పోయింది. పెట్రో కాంప్లెక్స్ వీజీ ఎఫ్ నిధులు రాష్ట్రం భరించే విషయంలో అప్పటి జగన్ సర్కారుదే తప్పని కేంద్రం కుండబద్దలు కొట్టింది. ఇక్కడ ప్రాజెక్టు ఏర్పాటుకు రెండు వేల ఎకరాలు సిద్ధంగా ఉన్నప్పటికీ గత సర్కారు తీరు వల్ల ప్రాజెక్టు కొడిగట్టిపోయింది.

కొంపముంచిన బాధ్యతా రాహిత్యం..

రాష్ట్ర విభజన సమయంలో విభజిత ఆంధ్రప్రదేశ్‌కు అప్పటి కేంద్ర ప్రభుత్వం ఒక్కో జిల్లాకు ఒక్కో కొత్త ప్రాజెక్టు కేటాయించింది. అందులో భాగంగా కాకినాడలో రూ.32 వేల కోట్లతో భారీ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొంది. 2017లో కాకినాడ ఎస్ఈజెడ్‌లో రెండు వేల ఎకరాల్లో ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేయడానికి గెయిల్- హెచ్‌పీసీఎల్ సంయుక్తంగా ఒప్పందం కుదుర్చుకున్నాయి. 1.5 ఎంఎంటీపీఏ సామర్థ్యంతో పెట్రో కాంప్లెక్స్‌ను ఏర్పాటుకు వీలుగా అప్పటి టీడీపీ ప్రభుత్వం నిర్వహించిన పెట్టుబడుల సదస్సులో అంగీకార పత్రాలు మార్చుకున్నాయి. విదేశాల నుంచి ముడిచమురు కాకినాడకు దిగుమతి చేసుకుని ఇక్కడే కర్మాగారం ఏర్పాటుచేసి, దాన్ని శుద్ధి చేసి దేశీయంగా వినియోగించడం ప్రాజెక్టు ముఖ్యోద్దేశం.

నాడు చంద్రబాబు ఏం చేశారు?



ఈ ప్రాజెక్టును సాధ్యమైనంత వేగంగా పట్టాలెక్కించడానికి 2019కి ముందు టీడీపీ ప్రభుత్వం చొరవ చూపింది. పనులు ప్రారంభిం చేలా కేంద్రంపై అప్పటి సీఎం చంద్రబాబు ఒత్తిడి తెచ్చారు. రూ.32 వేల కోట్ల విలువైన పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు వల్ల కేంద్రం ఇచ్చే ఆర్థిక మద్దతు, రాష్ట్ర ప్రభుత్వం భారీగా లబ్ధిపొందనున్నందున రూ.5,615 కోట్లు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) రూపంలో తమకు చెల్లించాలని అప్పట్లో కేంద్రం మెలిక పెట్టింది. అలా అయితేనే ప్రాజెక్టు ముందుకు కదులుతుందని పేర్కొంది.కానీ రాష్ట్రం విడిపోయి నష్టపోయినందున ఆ మొత్తం తాము భరించలేమని చంద్రబాబు కేంద్రంపై ఒత్తిడి తెచ్చారు. కేంద్రం కొంత మెత్తబడినట్టే కనిపించింది.

తరువాత జగనేం చేశారు?



2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో ప్రాజెక్టుకు గ్రహణం పట్టింది. నాటి నుంచీ ఈ ప్రాజె క్టు ఊసు పక్కన పడిపోయింది. తీవ్ర విమర్శల నేపథ్యంలో 2021 జూన్‌లో కేంద్రాన్ని సీఎం హోదాలో జగన్ కలిసి ప్రాజెక్టు కొనసాగించాలని కోరా రు. కానీ కేంద్రం నుంచి సానుకూల ప్రకటనేదీ రాలేదు. మూడేళ్ల కిందట పెట్రో కాంప్లెక్స్ అసలు కాకినాడకు వస్తుందా? రాదా? అనే దానిపై పలువురు ఎంపీలు కేంద్రాన్ని లోక్‌సభలో ప్రశ్నిస్తే ప్రాజెక్టు జాప్యానికి జగన్ ప్రభుత్వమే కారణం అని కుండ బద్దలుకొట్టింది. తాము అన్ని అనుమతులు మంజూరు చేసినా నష్ట భర్తీ నిధి చెల్లింపుపై ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేసింది. పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటుపై నిర్ణయం ఏపీ ప్రభుత్వానిదేనని సమాధానమిచ్చింది. అయినా జగన్ ప్రభుత్వం కనీసం ప్రయత్నించలేదు. దీంతో ప్రాజెక్టుపై పూర్తిగా ఆశలు వదులుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభు త్వం మళ్లీ ఆ ఫ్యాక్టరీ ఏర్పాటుపై దృష్టి పెట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

నెల్లూరు ప్రాజెక్టుతో మళ్లీ చర్చ..

రాష్ట్రప్రభుత్వం చొరవతో ఇటీవల నెల్లూరులో రూ.లక్ష కోట్లతో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) పెట్రో కాంప్లెక్స్ ఏర్పాటుకు ముందుకొచ్చింది. ఏటా తొమ్మిది మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో దీన్ని స్థాపిస్తోంది. ప్రాజెక్టు ద్వారా వేల మందికి ఉపాధి అవకాశాలు రానుండగా.. 42 నెలల్లో పూర్తి చేసేలా ఇటీవల ప్రణాళికలు సిద్ధమయ్యాయి. రెండు రోజుల కిందట బీపీసీఎల్ పెట్రో కాంప్లెక్స్‌కు కేంద్ర అటవీ పర్యావరణశాఖ నుంచి కీలక అనుమతులు జారీ అయ్యాయి. దీంతో ఇప్పుడు కాకినాడ పెట్రో కాంప్లెక్స్ ఏర్పాటు అంశం మరోసారి చర్చనీయాంశమైంది. తొమ్మిదేళ్ల నుంచి అతీగతీ లేని ప్రాజెక్టు నెల్లూరు పెట్రో కాంప్లెక్స్ ఏర్పాటుతో ఇక్కడా ఎంతో కొంత కదలిక రావాలనే ఆకాంక్షలు వ్యక్తమవుతున్నాయి. పెట్రో ప్రాజెక్టుకు అనువైన వాతావరణం ఉన్నా కేంద్రం పట్టించుకోక కాకినాడ పెట్రోకాంప్లెక్స్ అధ్యాయం ముగిసినట్టే కనిపిస్తోంది.


విశాఖకు బయల్దేరిన పర్యాటక బృందం

హమ్మయ్య.. వచ్చేశారు!

నేపాల్ నుంచి సురక్షితంగా కాకినాడ చేరిన సందర్శకులు

కాకినాడ, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): 'ఇవాళ.. నారా లోకేశ్, ఎంపీ సానా సతీష్, కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు చొరవ చూపకపోతే.. మేము కాకినాడ వచ్చేవాళ్లమే కాదు' ఇదీ నేపాల్‌లో చిక్కుకుని సురక్షితంగా కాకినాడ చేరుకున్న మహిళల మాట.. నేపాల్ పర్యటనకు వెళ్లి అక్కడ ఆందోళనకర పరిస్థితులతో చిక్కుకున్న కాకినాడ వాసులు ఎట్టకేలకు గురువారం రాత్రి క్షేమంగా స్వస్థలానికి చేరుకున్నారు. మంత్రి లోకేశ్ సకాలంలో స్పందించి ప్రత్యేక విమానంలో తమను క్షేమంగా విశాఖకు, అక్కడి నుంచి ప్రత్యేక వాహనంలో తమను కాకినాడ పంపారని వారు ఆనందం వ్యక్తం చేశారు. అక్కడి నుంచి తాము ఎలా బయటపడిందీ కాకినాడ నాగమల్లితోట కాలనీకి చెందిన దాట్ల రోజారాణి 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. తాము ఈ నెల ఏడో తేదీన కాఠ్మాండులోని గౌశాలాలో బస చేసిన హోటల్ రాయల్ కుసుమ్‌లో చిక్కుకోగా, విషయాన్ని తమ కుటుంబ సభ్యుల ద్వారా మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన ఎంపీ సానా సతీష్‌కు తమను కాకినాడకు చేర్చే బాధ్యత అప్పగించారని తెలిపారు. అలాగే కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు తమ పరిస్థితిని లోకేశ్‌కు వివరించడం.. ఇలా అందరి సహకారంతో కాకినాడ చేరుకోగలిగామని ఎల్‌బీనగర్ ఎస్ఎంటీ కాలనీకి తల్లీకుమార్తెలు బుద్ధరాజు సరళ, ఆమె కుమార్తె రోజారాణి, గాంధీనగర్‌కు చెందిన సి.రాధ, జి.కృష్ణవేణి తెలిపారు.

ఇక అన్నీ ఇక్కడినుంచే..


గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాసం

- చేబ్రోలు డిప్యూటీ సీఎం నివాసం నుంచే పార్టీ కార్యకలాపాలు
- పిఠాపురంలో జనసేన కార్యాలయం ఖాళీ చేయాలని ఆదేశాలు
- నియోజకవర్గ పార్టీ కార్యకలాపాలపై పవన్‌కల్యాణ్ స్పష్టత
- ఆసక్తికరంగా వరుస పరిణామాలు

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

జనసేన పార్టీ పిఠాపురం నియోజకవర్గ కార్యకలాపాలు అన్నీ ఇకనుంచి గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాసంనుంచే జరగనున్నాయి. పిఠాపురంలో జనసేన ఇన్‌చార్జి ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని ఖాళీచేయాలని ఆదేశాలు వచ్చాయి. పార్టీ కార్యక్రమాల నిర్వహణపై స్పష్టత ఇస్తూ సూచనలు వచ్చినట్లు పార్టీ వర్గాలు తెలిపారు.

మంగళగిరిలో జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో పిఠాపురం నియోజకవర్గంలోని జనసేన క్రియాశీలక కార్యకర్తలు, ముఖ్య కార్యకర్తలతో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సమావేశం నిర్వహించిన నాటినుంచి పిఠాపురం నియోజకవర్గం జనసేనలో జరుగుతున్న పరిణామాలు ఆసక్తికరంగా మారాయి. సమావేశంలో నియోజకవర్గంలో జనసేన పార్టీలో జరుగుతున్న పరిణామాలు, సమన్వయం లేకపోవడంపై పవన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. దీన్ని అధిగమించేందుకు గ్రామస్థాయిలో అయిదుగురు సభ్యులతో కమిటీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామానికి ఐదుగురు చొప్పున సభ్యుల ఎంపిక బాధ్యతను కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మలబాబు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, పార్టీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావులకు అప్పగించారు. ఇప్పటికే కమిటీల ఎంపిక నిమిత్తం కొత్తపల్లి మండలంలో మూడు రోజులు, గొల్లప్రోలు మండలంలో రెండు రోజులపాటు సమావేశాలు నిర్వహించి సభ్యులను ఎంపిక చేశారు. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలు, పిఠాపురం మండలంలోని 24 గ్రామాలకు సభ్యుల ఎంపిక నిమిత్తం సమావేశాలు నిర్వహించాల్సి ఉంది.

ఇప్పుడు కార్యాలయం వంతు

ఎన్నికల సమయంలో గొల్లప్రోలు మండలం చేబ్రోలులో బైపాస్‌రోడ్డులోని పార్టీ నాయకుడు ఓదూరి నాగేశ్వరరావుకు చెందిన బహుళ అంతస్తుల భవనాన్ని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తన నివాసంగా ఎంపిక చేసుకున్నారు. ఇక్కడ నుంచే పార్టీపరంగా అన్ని సమావేశాలు, ఇతర ముఖ్య కార్యక్రమాలను నిర్వహించారు. ఎన్నికల అనంతరం డిప్యూటీ సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత ఇక్కడికే వచ్చారు. దీన్ని నివాసంగా, క్యాంపు కార్యాలయంగా, పార్టీ కార్యాలయంగా వినియోగించేవారు. జనవాణి కార్యక్రమాన్ని ఇక్కడ నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న మర్రెడ్డి శ్రీనివాసరావు ఇక్కడ ఉండే కార్యక్రమాలు చక్కపెట్టేవారు. ఆరునెలల క్రితం మర్రెడ్డికి, భవన యజమానికి తలెత్తిన వివాదం నేపథ్యంలో మర్రెడ్డి చేబ్రోలులోని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాసానికి వెళ్లడం మానివేశారు. కార్యాలయ సిబ్బంది కొందరు అక్కడే విధులు నిర్వర్తిస్తున్నారు. అనంతరం పిఠాపురం పట్టణంలోని మంగాయమ్మరావుపేటలో భవనం అద్దెకు తీసుకుని దానికే జనసేన పార్టీ నియోజకవర్గ కార్యాలయంగా బోర్డు ఏర్పాటుచేసి అక్కడినుంచే మర్రెడ్డి, ఇతర నాయకులు కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఫైవ్‌మెన్ కమిటీ ఏర్పాటుతో పరిణామాలు మారిన నేపథ్యంలో పిఠాపురంలోని జనసేన పార్టీ నియోజకవర్గ కార్యాలయాన్ని తక్షణం ఖాళీ చేయాలని, చేబ్రోలులోని కార్యాలయం నుంచే పిఠాపురం నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాకలాపాలు నిర్వహించాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు ఫైవ్‌మెన్ కమిటీకి సమాచారం ఇచ్చారు. ప్రస్తుతం ఈ అంశం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. జనసేన పార్టీలో జరుగుతున్న పరిణామాలకు ఇది సంకేతమని చెబుతున్నారు. కాగా చేబ్రోలులోని పవన్ నివాసం నుంచే నియోజకవర్గ పార్టీ కార్యక్రమాలు జరుగుతాయని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మలబాబు తెలిపారు.

అన్ని కమిటీతోనే..

ఫైవ్‌మెన్ కమిటీని పవన్‌కల్యాణ్ నియమించిన నాటినుంచి పార్టీపరంగా, ప్రభుత్వపరంగా అన్ని కార్యక్రమాల్లోను వీరు కీలకపాత్ర పోషిస్తున్నారు. స్మార్ట్ రైసుకార్డుల పంపిణీలో ఎంపీ ఉదయశ్రీనివాస్, సీఎం రిలీఫ్ ఫండ్, ప్రమాదవశాత్తూ మరణించిన జనసైనికులకు రూ.5లక్షల చెక్కుల పంపిణీలోను తుమ్మలబాబు, దొరబాబు, మర్రెడ్డి పాల్గొన్నారు. పార్టీ కార్యాలయంనుంచి వచ్చేషెడ్యూల్‌లోనూ హరిప్రసాద్ మినహా మిగిలిన సభ్యులందరూ పాల్గొంటున్నట్లు సమాచారం ఇస్తున్నారు.

వేగంగా 'పోలవరం'.. ఎడమ కాలువ పనులు


తునిలో తాండవ నదిపై నిర్మాణంలో ఉన్న అక్విడెక్టు పనులు

- జనానికి ఇబ్బందులు లేకుండా అలైన్‌మెంట్‌లో మార్పులు
- కుమ్మరిలోవలో 60 మీటర్ల లోపలకి కాలువ నిర్మాణాలు

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పోలవరం ఎడమ కాలువ పనులు వేగంగా జరుగుతున్నాయి. డిసెంబరు నెలాఖరుకు పనులు పూర్తిచేసేందుకు రేయింబవళ్లు పనులు జరుగుతున్నాయి. జనానికి ఇబ్బందులు లేకుండా ఉండాలనే లక్ష్యంతో అలైన్‌మెంట్‌లో మార్పులు చేసి తవ్వకాలు చేస్తున్నారు. జిల్లాలో తుని మండలం పరిధిలో ఉన్న పోలవరం ఎడమ కాలువ పనులు చివరి దశకు చేరుకున్నాయి. కాలువ నిర్మాణాల నేపథ్యంలో భారీ కొండను తొలగించాల్సి వచ్చింది.దీనివల్ల రాళ్ల సమీపంలో ఉన్న తునిపట్టణంలో ఒకటోవార్డు (డ్రైవర్స్ కాలనీ)లో జనావాసాలపై పడే అవకాశం ఉంది. దీంతో ప్రజల ఫిర్యాదు మేరకు కాలువ అలైన్‌మెంట్‌ను అధికారులు మార్పు చేశారు. కుమ్మరిలోవలో 60మీటర్ల లోపలకు కాలువ తవ్వకాలు చేపట్టాలని తాజాగా నిర్ణయించి పనులు చేస్తున్నారు. దీనివల్ల ఎడమ కాలువనిర్మాణాలకు ఉన్న ఆటంకాలు చాలావరకు తొలగిపోయాయి. ప్యాకేజీ-5లో ఉన్న ఈ కాలువను రూ.307కోట్లతో 18 కిలోమీటర్ల మేరకు తవ్వాల్సి ఉంది. ఇప్పటివరకు 17 కిలోమీటర్ల మేరకు కాలువ పనులు చేశారు. ఇంకా 1.2 కిలోమీటర్ల మేరకు పనులు చేయాల్సిఉంది. గత ఐదేళ్లపాటు వైసీపీ ప్రభుత్వంలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. ఇది వైసీపీ వాళ్లకు కేవలం ఆదాయం ఇచ్చే వనరుగా మాత్రమే ఉంది. ఎడమ కాలువలో మట్టిని ఇష్టారాజ్యంగా తవ్వుకుని అమ్ముకున్నారు. పైగా పనులు ఐదేళ్లపాటు పడకేశాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోలవరం ఎడమ కాలువ పనులు ఊపందుకున్నాయి.కంట్రోల్ బ్లాస్టింగ్‌విధానంలో రోజుకు 25వేల క్యూబిక్ మీటర్లు కొండను కొట్టి రాళ్లను తొలగిస్తున్నారు. ఇది పూర్తయిన తర్వాత ప్యాకేజీ 6, 7 కింద యలమంచిలిలో, ప్యాకేజీ8 కింద విశాఖపట్నం జిల్లా పరిధిలో పనులు జరుగుతాయి.

మెట్ట సస్యశ్యామలం

పోలవరం ఎడమ కాలువ పూర్తి కావడం ద్వారా మెట్టప్రాంతం సస్యశ్యామలం అవుతుంది. జిల్లాలో 1.21లక్షల ఎకరాలు సాగులోకి వస్తాయి. ప్రధానంగా జగ్గంపేట, ప్రత్తిపాడు, తుని మండలాల పరిధిలో భూములు సాగులోకి వస్తాయి. ఇది కాకినాడ, అనకాపల్లి జిల్లాల మీదుగా విశాఖ వరకు నిర్మాణం చేస్తారు. ఈ కాలువ సామర్థ్యం 17,561 క్యూసెక్కులు. నీటి కేటాయింపులను పరిశీలిస్తే ఇరిగేషన్ కోసం 84.808 టీఎంసీలు, తాగునీరుతోపాటు పరిశ్రమల వినియోగం నిమిత్తం 23.44 టీఎంసీలుగా నిర్ణయించారు.

వేగంగా పనులు: కలెక్టర్

తుని పరిధిలో పోలవరం ఎడమ కాలువ పనులు వేగంగా జరుగుతున్నాయి. జనావాసాలకు ఇబ్బందులున్న ప్రాంతంలో అలైన్‌మెంట్ మార్పుచేసి నిర్మాణాలు సాగుతున్నాయి. కుమ్మరిలోవలోఉన్న మరో ఏడు కుటుంబాలను ఇతరప్రాంతానికి తరలించి పరిహారం ఇవ్వనున్నాం.పనులను పర్యవేక్షిస్తున్నాం.

రేపు 400 మెట్రిక్ టన్నుల యూరియా రాక

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాకు ఈనెల 13న 400 మెట్రిక్ టన్నుల యూరియా రానుంది. ఈ మేరకు ప్రభుత్వం కేటాయింపులు చేసింది. ద్వారపూడి నుంచి ఈ యూరియా నిల్వలను జిల్లాలో పీఏసీఎస్‌లు, రైతు సేవా కేంద్రాలు, ప్రైవేటు ఎరువుల డీలర్ల దుకాణాలకు సరఫరా చేస్తారు. జిల్లాలో ఎక్కడైతే యూరియా అవసరం ఎక్కువగా ఉందో అక్కడకు ఎక్కువగా కేటాయింపులు చేస్తున్నారు.

ఎరువుల దుకాణాలపై కొనసాగుతున్న దాడులు

జిల్లాలో గురువారం ఎరువుల దుకాణాలపై వ్యవసాయశాఖ, విజిలెన్స్ బృందాలు దాడులు చేశాయి. తునిలో ఒక దుకాణంలో స్టాక్ వ్యత్యాసం నేపథ్యంలో 6ఏ కేసు నమోదు చేశారు. దీంతో ఇప్పటివరకు జిల్లాలో నమోదైన కేసులు తొమ్మిదికి చేరాయి. ఎరువుల అక్రమ నిల్వలపై దాడులు కొనసాగుతాయని వ్యవసాయశాఖ జేడీ వెల్లడించారు.

గిరిజన గ్రామాలకు బస్సు

- పదేళ్ల గిరిజనుల నిరీక్షణకు తెర
- చొరవ చూపిన ఎంపీ ఉదయ్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ


గిరిజన గ్రామాలకు నిర్మించిన రోడ్డు

శంఖవరం/కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): దశాబ్దకాలంక్రితం నిలిచిపోయిన పెదమల్లాపురం బస్సు మళ్లీ అందుబాటులోకి వచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎంపీ ఉదయ్, ఎమ్మెల్యే సత్యప్రభ కృషితో గిరిజనులకు శుభవార్త అందింది. గోతులు రహదారిని రాజమార్గంగా ఏర్పాటు చేసిన కూటమి ప్రభుత్వం శుక్రవారం తుని నుంచి పెదమల్లాపురం వరకూ ఆర్టీసీ బస్సు పునః ప్రారంభించనుంది. ఎమ్మెల్యే సత్యప్రభ ఈ బస్సు సర్వీసులను ప్రారంభించనున్నారు. బస్సు సదుపాయం లేక గిరిజనులు తమ పంటలను పట్టణాలకు తరలించలేక స్థానిక సంతలోనే తక్కువ ధరకు విక్రయించేవారు. ఇప్పుడు తమ పంటలకు కూడా గిట్టుబాటు ధర వస్తుందని గిరిజనులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఎంపీ ఉదయ్ చొరవతో కాకినాడ నుంచి వేళంగి వరకు కూడా బస్సు సర్వీసుల ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

కళాకృతులు!

మొక్కల బొమ్మలకు పెరుగుతున్న క్రేజ్
కొత్త పంథా ఎంచుకుంటున్న యువ రైతులు









(ఆంధ్రజ్యోతి - కడియం)

దేశంలోనే ప్రముఖ గార్డెన్స్‌లో కనువిందు చేసే మొక్కల బొమ్మలు ఇప్పుడు కడియం నర్సరీల్లో సందడి చేస్తున్నాయి. గతంలో ఈ మొక్కను పెంచి, పోషించి బొమ్మల ఆకృతిలో తీర్చిదిద్దడానికి ఆయా గార్డెన్స్ నిర్వాహకులకు చాలాకాలం పట్టేది. కానీ ఇప్పుడు ట్రెండ్ మారింది. నర్సరీల్లోనే ఈ మొక్కల బొమ్మలను అద్భుతంగా తయారుచేసి గార్డెన్స్‌లకు, కార్పొరేట్ కంపెనీలకు ఖరీదైన గృహ యజమానులకు విక్రయిస్తున్నారు. అందుకనే ఈ మొక్కల బొమ్మలకు విశేష ఆదరణ పెరుగుతోంది. ఇప్పటికే పలువురు ఈ మొక్కల బొమ్మలను తీర్చిదిద్దగా తాజాగా కడియం మండలం పొట్టిలంక గ్రామంలో మురుగన్ నర్సరీ యువకుడు దూలం ధనరాజు తయారుచేసిన మొక్కలు కొత్త ట్రెండ్‌ను సృష్టిస్తున్నాయి.

● బొమ్మల తయారీ స్ఫూర్తితో..

చదువుకునే సమయంలో ఆటబొమ్మలు చేయడం ధనరాజుకు అలవాటు. చెక్కతో, మట్టితో తయారుచేసేవాడు. తర్వాత అయ్యప్పస్వామి మందిరాలు, పెళ్లిళ్లలో ఆకృతులు చేయడంలోనూ దిట్ట. అదిప్పుడు ఈ మొక్కల రూపకల్పనకు శ్రీకారం చుట్టింది. పొట్టిలంకలో నర్సరీ నిర్వహిస్తున్న ఈ యువకుడు ఆలమూరు మండలం మడికి గ్రామం. చెముడులంక ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదివి రాజమహేంద్రవరం కూరగాయల మార్కెట్‌లో, మడికి కూరగాయల మార్కెట్‌లో గుమస్తాగా పనిచేశాడు.

● 50 సెంట్ల భూమిని కౌలుకి తీసుకుని..

50 సెంట్లు భూమిని కౌలుకి తీసుకుని తన ప్రయత్నం ప్రారంభించాడు. యూట్యూబ్‌లో చూసి ఏ ఆకారాలు మొక్కలు బొమ్మలుగా మారిస్తే ఆకర్షణీయంగా ఉంటుందో ఆలోచించాడు. గిటారి, చెస్‌బోర్డులో గుర్రం, ఇంటి ఆవరణ లైటు, అందమైన పుష్పం వంటి మొక్కల తయారుపై దృష్టి పెట్టాడు. ఈ మొక్కల తయారీకి నేర్పరితనం కలిగిన కూలీలు కావాల్సి ఉంటుంది. తీగజాతి మొక్కను ముందుగా తయారు చేసుకున్న బొమ్మల ఆకారంలో ఇనుపమెస్‌లకు వీటిని అల్లుతారు. ఈ మొక్క కావాల్సిన ఆకారం వచ్చేవరకు కటింగ్ చేస్తూ ఉండాలి. ధనరాజు కూలీలు లేకుండా తానే ఈ బొమ్మలను రూపుదిద్దుతున్నాడు.

● విభిన్నంగా మొక్కలు తయారు చేయాలని..



చదువు అయ్యాక కొంతకాలం కూరగాయల మార్కెట్‌లో గుమస్తాగా చేశాను. అయితే తనే సొంతంగా ఏదైనా చేయాలనే తపన ఉండేది. బొమ్మలు వేయడంలో ఆసక్తి ఉండేది. ఆ అభిరుచినే ఉపాధిగా ఎందుకు మలుచుకోకూడదనే ఆలోచన వచ్చింది. అర ఎకరం భూమి లీజుకు తీసుకుని టెర్మినేలియా గ్రీన్, ఫాక్స్‌టెయిల్ వంటి మొక్కలు తయారుచేసి విక్రయించేవాడిని. అయితే ఈ రకాలు అందరూ చేస్తున్నారు. మామూలు నర్సరీ మొక్కల తయారు కంటే పెట్టుబడి ఎక్కువయినప్పటికీ మనం బిన్నంగా చేయాలని ఆలోచించి ఈ రకంగా మొక్కల బొమ్మలు తయారు చేయడం ప్రారంభించాను. - **దూలం ధనరాజు, నర్సరీ నిర్వాహకుడు పొట్టిలంక, కడియం మండలం**

నేడు కాకినాడ కలెక్టరేట్‌లో
ధాన్యం సేకరణపై సమీక్ష

» హాజరుకానున్న పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్
» ఐదు జిల్లాల అధికారులతో ధాన్యం సేకరణపై ప్రత్యేక కార్యాచరణ

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌సీజన్‌లో ధాన్యం సేకరణ కార్యాచరణ ప్రణాళికపై సమీక్షించేందుకు రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శుక్రవారం కాకినాడకు విచ్చేస్తున్నారు.కాకినాడ కలెక్టరేట్‌లో ఉదయం 10.15గంటలకు సమావేశం ఆరంభమవుతుంది. కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాలకు చెందిన జేసీలు, సివిల్ సప్లయిస్ అధికారులు, వ్యవసాయశాఖ అధికారులు, ఇతర సంబంధితశాఖల అధికారులు పాల్గొంటారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో ఐదు జిల్లాల పరిధిలో ఏ మేరకు వరిపంటను సాగు చేశారు. ఏఏ రకాల వరివిత్తనాలు నాటారు. ఎంతమేరకు ఉత్పత్తి వస్తోంది.. వంటి అంచనాలపై చర్చిస్తారు. ధాన్యం సేకరణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రైతు సేవా కేంద్రాల ద్వారా సేకరించే సమయంలో ఎదుర్కొంటున్న సమస్యలపై సమీక్షిస్తారు. ధాన్యం సేకరణ సమయంలో మిల్లర్లు రైతులకు అందించాల్సిన సహకారంపై సూచనలు ఇస్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం 48 గంటల్లోనే రైతుల బ్యాంకు ఖాతాలోకి ధాన్యం సొమ్ములు జమ చేస్తోంది. ఇందులో ఏమైనా ఇబ్బందులు ఉంటే మంత్రి దృష్టికి తీసుకురావొచ్చు. ధాన్యం సేకరణ కార్యాచరణ ప్రణాళికపై ఐదు జిల్లాల అధికారులు మంత్రి ముందు ప్రజంటేషన్ ఇస్తారు. ఏ ఏ జిల్లాల్లో ఏ మేరకు సేకరణ చేయగలమో వివరిస్తారు. ధాన్యం సాగులో రాష్ట్రంలోనే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలకు ప్రత్యేక స్థానం ఉంది. ఈ నేపథ్యంలో ఈఐదు జిల్లాలపై ప్రభుత్వం ప్రత్యేకంగా ఫోకస్‌పెట్టింది. కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ కమిషనర్ సౌరభ్‌గౌర్, కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ పాల్గొంటారు.

పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల పర్యటన షెడ్యూల్

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శుక్రవారం ఉదయం 5గంటలకు కాకినాడ జీఆర్‌టీ హోటల్‌కు చేరుకుంటారు. అనంతరం ఉదయం 10.15గంటలకు కాకినాడ కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షకు హాజరవుతారు. సమీక్ష ముగిసిన తర్వాత మధ్యాహ్నం 2.30గంటలకు రైస్‌మిల్లర్లు, రైతులు, పీఏసీఎస్ ప్రతినిధులతో సమావేశమవుతారు. 5.30గంటలకు ముగిస్తారు. సాయంత్రం 6గంటలకు జీఆర్‌టీకి చేరుకుంటారు. తర్వాత విజయవాడకు పయనమవుతారు.

శ్రీలంక సముద్ర జలాల్లో..
చిక్కుకున్న మత్స్యకారులు

» విడుదలకు ఫలించిన కాకినాడ ఎంపీ ఉదయ్ కృషి

కాకినాడ క్రైం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): సముద్ర జలాల్లో వేట సాగిస్తున్న సోనాబోటు నావిగేషన్ వ్యవస్థలో ఏర్పడిన సాంకేతిక సమస్య కారణంగా పొరపాటున శ్రీలంక దేశ సముద్ర జలాల్లోకి ప్రవేశించి అక్కడ జైల్లో మగుతున్న కాకినాడ మత్స్యకారులు ఎట్టకేలకు విడుదలయ్యారు. దీంతో మత్స్యకారుల విడుదలకోసం కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ నెలరోజులుగా చేసిన కృషి ఫలించింది. గతనెల 4వతేదీన కాకినాడ, జగన్నాథపురానికి చెందిన పంతాడి బ్రహ్మానందంతోపాటు మరో ముగ్గురు మత్స్యకారులు అక్రమంగా తమ సముద్ర జలాల్లోకి ప్రవేశించారని శ్రీలంక కోస్ట్‌గార్డ్ అధికారులు అదుపులోకి తీసుకుని జాఫ్నా జైల్లో నిర్బంధించారు. అదే రోజు విషయం తెలుసుకున్న ఎంపీ వెంటనే స్పందించి శ్రీలంకలో భారత కాన్సుల్ జనరల్ అధికారి సాయిమురళీతో ఫోన్ మాట్లాడి పరిస్థితి వివరించడంతోపాటు ఎప్పటికప్పుడు ఢిల్లీలో విదేశాంగశాఖ అధికారులను సంప్రదించి మత్స్యకారుల విడుదలకు చర్యలు తీసుకోవాలని ఒత్తిడి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో ఎట్టకేలకు గురువారం జాఫ్నా కోర్టు నలుగురు మత్స్యకారులను విడుదల చేయగా వారి బోటును తిరిగి అప్పగించారు. మత్స్యకారులు మరో రెండురోజుల్లో కాకినాడకు చేరుకోనున్నారు. మత్స్యకారుల విడుదల కోసం అవిశ్రాంత పోరాటం చేసిన ఎంపీ ఉదయ్ శ్రీనివాస్‌కు మత్స్యకార సంఘ నాయకులు, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతిభకు ప్రోత్సాహం

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పలువురు ఆర్థికంగా ఇబ్బందులు పడుతుంటారు. బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలనే ఆసక్తిగా ఉన్నా.. వారికి సరైన ప్రోత్సాహం లభించదు. అలాంటి ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ మీన్స్‌కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)ను ప్రారంభించింది. 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుకునే పేద విద్యార్థులను ప్రోత్సహించడం ఈ పథకం లక్ష్యం.

» ఆర్థికంగా వెనకబడిన విద్యార్థులకు కేంద్రం సాయం
» ఎన్ఎంఎంఎస్ దరఖాస్తులకు ఆహ్వానం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఆంధ్రప్రదేశ్ డైరెక్టరేట్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్(ఏపీ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్) విభాగం ఈ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పథకం కింద పరీక్ష నిర్వహించి, ఎంపికైన అభ్యర్థులకు స్కాలర్‌షిప్ అందిస్తారు. అర్హులకు తొమ్మిది, పది, ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ విద్యార్థులకు ఏడాదికి రూ.12 వేల చొప్పున ఉపకార వేతనాలు అందజేస్తారు.

దరఖాస్తు చేసుకోవడం ఇలా..

ఎన్ఎంఎంఎస్ కోసం హెచ్‌టీటీపీ://డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీలు రూ.50 పరీక్ష ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాలి. ఏడో తరగతిలో 55 శాతం మార్కులు కచ్చితంగా ఉండాలి. ఈ ఏడాది పరీక్షకు ఈ నెల నాలుగో తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అక్టోబర్ 30 నాటికి దరఖాస్తు గడువు పూర్తికానుంది. డిసెంబర్ ఏడో తేదీన పరీక్ష నిర్వహిస్తారు. ప్రశ్నాపత్రం తెలుగు, ఇంగ్లిష్ మీడియంలలో ఉంటుంది. మేధస్సుకు పదును పెట్టేలా 90 ప్రశ్నలు, గణితం 20, సోషల్ 35, సైన్స్ 12, ఎస్ఎస్ 11 ప్రశ్నలు ఉంటాయి. ఉత్తీర్ణత పొందినవారు 8, 9 తరగతుల్లో 55 శాతం, పదోతరగతి 60, ఇంటర్ ప్రథమ, ద్వితీయం 55 శాతం చొప్పున మార్కులు సాధిస్తేనే ఉపకార వేతనాలు లభిస్తాయి. విద్యార్థి కుటుంబ వార్షికాదాయం రూ.మూడున్నర లక్షలకు మించి ఉండకూడదు.

ఏడాదికి 200 మందికి పైగా..

కేంద్ర ప్రభుత్వం నేషనల్ మీన్స్‌కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) పరీక్షను గత కొన్నేళ్లుగా నిర్వహిస్తూ వస్తోంది. ఆర్థికంగా వెనకబడిన విద్యార్థులను ప్రోత్సహిస్తోంది. గత నాలుగేళ్లుగా ఏడాదికి సుమారు 200 మందికిపైగా విద్యార్థులకు ఈ ఉపకార వేతనాలు అందజేస్తోంది.



శిక్షణ పొందుతున్న నూతన ఎంపీడీవోలనుద్దేశించి ప్రసంగిస్తున్న కమిషనరు ముత్యాలరాజు

ఉద్యోగులు పనితీరు మెరుగుపరుచుకోవాలి

శిక్షణ పొందుతున్న ఎంపీడీవోలకు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ కమిషనరు రేవు ముత్యాలరాజు సూచన

సామర్లకోట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు పనితీరు మెరుగుపరుచుకోవాలని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ కమిషనరు రేవు ముత్యాలరాజు పేర్కొన్నారు. ఎంపీడీవోలుగా ఇటీవలే ఉద్యోగోన్నతి పొంది కాకినాడ జిల్లా సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న వారితో ఆయన కొద్దిసేపు మాట్లాడారు. ఉద్యోగంలో ప్రతిరోజూ ప్రతి స్థాయిలో సమస్యలు ఎదురవుతుంటాయని, వాటిని తమ నైపుణ్యంతో సమర్థంగా ఎదుర్కోవాలన్నారు. ప్రతిరోజూ ఎదురవుతున్న సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో గుర్తించి అదే తీరులో పరిష్కరిస్తే ఇబ్బందులు ఉండవన్నారు. అప్పుడే ఉద్యోగ జీవితం సంతృప్తికరంగా ఉంటుందని, శిక్షణల ద్వారా పరిపాలనా నియమావళిపై సమగ్ర అవగాహన పొంది సత్ఫలితాలు సాధించవచ్చన్నారు.

సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం పనితీరు సంతృప్తికరంగా ఉందని ముత్యాలరాజు పేర్కొన్నారు. గురువారం ఆయన శిక్షణ తరగతులు, అధికారులకు వసతి, భోజన సదుపాయాలు, శిక్షణా కేంద్ర ఆవరణలో పచ్చదనంలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రిన్సిపాల్ కేఎస్వీ ప్రసాదరావు ద్వారా తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. సువిశాలమైన ఆవరణ ఉన్నందున శిక్షణ తరగతులకు వసతులు పెంచుకోవాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. వైద్య, విద్య, ఇంజనీరింగ్ వంటి ఇతర ప్రభుత్వ శాఖల శిక్షణలు కూడా ఈటీసీ ఆవరణలో నిర్వహించుకునేలా ప్రణాళికలు రూపొందించుకునేందుకు జిల్లాలోని పలు ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో చర్చించాలన్నారు. ఇందుకు నిర్వహణా కమిటీ సభ్యుల నుంచి సూచనలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. అధ్యాపకులతో సమావేశమై శిక్షణ తీరుతెన్నులపై సమాచారాన్ని రాబట్టారు. ప్రతి ఉద్యోగికీ కేడర్‌లో పనితీరు మెరుగుపరుచుకునేందుకు శిక్షణలు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనంతరం శిక్షణ కేంద్రం ఆవరణలో ఒక మొక్కను కమిషనరు ముత్యాలరాజు నాటారు. ప్రిన్సిపాల్ ప్రసాదరావు, తూర్పు గోదావరి జిల్లా జడ్పీ సీఈవో వీవీఎస్ లక్ష్మణరావు, కాకినాడ జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్ జి.రమణ, జేఎన్టీయూకే ప్రొఫెసర్ ఆలపాటి శ్రీనివాసు, డీడీవోలు శ్రీనివాసు, విజయభాస్కర్ పాల్గొన్నారు.

అయోధ్య బాలరాముడికి ప్రత్యేక విల్లంబు



శ్రీనివాసశాస్త్రికి విల్లంబు అందజేస్తున్న దృశ్యం

మండపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలోని బాలరాముడికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం మారేడుబాకకు చెందిన శిల్పి వాసా శ్రీనివాసరావు 9 కిలోల వెండిపై రెండు తులాల బంగారు పూతతో విల్లంబు (బాణం) తయారు చేశాడు. ఐదుగురు కళాకారులు 15 రోజులు శ్రమించి ఏడు అడుగులు ఎత్తు, 9.5 కిలోల రాగి, రెండు కాసులు బంగారంతో పూత పూశారు. ఇందుకు రూ.2 లక్షలు వ్యయమైందని శ్రీనివాసరావు చెప్పాడు. గురువారం దీనిని అయోధ్యకు చెందిన శ్రీరామ వృక్షం ట్రస్టు వ్యవస్థాపకుడు చల్లా శ్రీనివాసశాస్త్రికి శ్రీనివాసరావు అందజేశారు.

సిద్ధివినాయకునికి వెండి పళ్లెం బహూకరణ

అయినవిల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లిలోని శ్రీసిద్ధి వినాయకస్వామిని విశాఖపట్నం జిల్లా తగరపువలసకు చెందిన కటకం అవినాష్-సాహిత్యశృతి దంపతులు గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి రూ.లక్షా 35వేల విలువైన ఒక కిలో 50 గ్రాముల వెండి పళ్లెం బహూకరించారు. దాతలకు ఆలయ ప్రధానార్చకుడు వేదాశీర్వచనం అందజేసి శేషవస్త్రంతో సత్కరించారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేసి అభినందించారు.



వెండి పళ్లెం అందజేస్తున్న అవినాష్-సాహిత్య శృతి దంపతులు





వేదాశీర్వచనం పొందుతున్న సమగ్ర శిక్షా ప్రాజెక్టు రాష్ట్ర డైరెక్టర్ శ్రీనివాసరావు, సత్యదేవుడి దర్శనానంతరం ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్

సత్యదేవునికి ప్రముఖుల పూజలు

అన్నవరం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధికి రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ గురువారం విచ్చేశారు. ఆయనకు ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం జవహర్‌కు పండితులు వేదాశీర్వచనం ఇవ్వగా ఈవో స్వామివారి ప్రసాదం అందజేశారు. ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ అన్నవరం దేవస్థానంలో పనిచేస్తున్న ఎస్సీ ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఉద్యోగాలు, పదోన్నతుల్లో ఎస్సీ రిజర్వేషన్ అమలవుతోందా అని అడిగి తెలుసుకున్నారు. తమకు ఎటువంటి ఇబ్బందులూ లేవని వారు సమాధానమిచ్చారు. దేవస్థానంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల నియామకాల్లో ఎస్సీ రిజర్వేషన్ పాటించాలని ఈవోకు మంత్రి సూచించారు.

సమగ్ర శిక్షా డైరెక్టర్ (ఐఏఎస్) బి.శ్రీనివాసరావు సత్యదేవుని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. రెవెన్యూ ప్రొటోకాల్ అధికారి భాస్కరప్రసాద్ పాల్గొన్నారు.

ఉమ్మడి 'తూర్పు'లో 16 మందికి ఎంపీడీవోలుగా ఉద్యోగోన్నతి

సామర్లకోట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాలోని పలు మండల పరిషత్ కార్యాలయాల్లో ఏవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలుగా పనిచేస్తున్న 16 మందికి ఎంపీడీవోలుగా పదోన్నతి కల్పించారు. వీరు తక్షణం ఆయా మండలాల్లో బాధ్యతలు చేపట్టాలని జడ్పీసీఈవో వీవీఎస్ లక్ష్మణరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

- ఏలేశ్వరం ఎంపీడీవో కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న కె.వెంకట సూర్యనారాయణను పెద్దాపురం ఎంపీడీవోగా నియమించారు.ఇప్పటివరకు పెద్దాపురం ఎంపీడీవోగా పనిచేసిన డి.శ్రీలలిత విశాఖ జిల్లా డీపీవోగా ఉద్యోగోన్నతిపై బదిలీ అయ్యారు.
- యు.కొత్తపల్లి డిప్యూటీ ఎంపీడీవో కె.హరికృష్ణ సత్యారెడ్డిని గండేపల్లి ఎంపీడీవోగా నియమించారు.
- రాజమహేంద్రవరం ఎంపీడీవోగా అక్కడే డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న కేఎస్ ఆర్మ్‌స్ట్రాంగ్‌ను నియమించారు.
- అల్లవరం ఎంపీడీవోగా ఉప్పలగుప్తం డిప్యూటీ ఎంపీడీవో పీఆర్‌సీ రాజ్‌కుమార్‌ను నియమించారు.
- ఉప్పలగుప్తం ఎంపీడీవోగా అనకాపల్లి జిల్లా డ్వామా ఏవో డి.కృష్ణను నియమించారు.
- పి.గన్నవరం ఎంపీడీవోగా మలికిపురంలో డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న జి.మల్లికార్జునరావును నియమించారు.
- కపిలేశ్వరపురం ఎంపీడీవోగా అనకాపల్లి జిల్లా రావికమతం డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న హెచ్.భానోజీరావును నియమించారు.
- అంబాజీపేట ఎంపీడీవోగా కాట్రేనికోన డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న బి.మమతను నియమించారు.
- మలికిపురం ఎంపీడీవోగా ముమ్మిడివరం డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న సీహెచ్ లక్ష్మీకల్యాణిని నియమించారు.
- సఖినేటిపల్లి ఎంపీడీవోగా కె.గంగవరం డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న కేఎస్ గౌరీ కుమారిని నియమించారు.
- యు.కొత్తపల్లి ఎంపీడీవోగా శంఖవరం మం డల పరిషత్ కార్యాలయ ఏవోగా పనిచేస్తున్న ఎ.లక్ష్మీరెడ్డిని నియమించారు.
- అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగల ఎంపీడీవోగా విశాఖ జిల్లా అనంతగిరి మండల పరిషత్ కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న ఏవీవీ కుమార్‌ను నియమించారు.
- కాకినాడ రూరల్ ఎంపీడీవోగా కాకినాడ జిల్లా పరిషత్ కార్యాలయ ఏవోగా పనిచేస్తున్న బి.కృష్ణగోపాల్‌ను నియమించారు.
- తాళ్లరేవు ఎంపీడీవోగా అల్లవరం మండల పరి షత్ కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న బి.లక్ష్మణరావును నియమించారు.
- గోకవరం ఎంపీడీవోగా అనకాపల్లి జిల్లా పాయకరావుపేట ఎంపీడీవో కార్యాలయ ఏవోగా పనిచేస్తున్న సీహెచ్ రవికుమార్ వర్మను నియమించారు.
- శంఖవరం ఎంపీడీవోగా కృష్ణా జిల్లా పామర్రు డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న జి.కిషోర్‌ను నియమించారు.

అండర్-14, 17 బాలబాలికల క్రీడా పోటీలు ప్రారంభం

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా 68వ పాఠశాల క్రీడా సమాఖ్య అండర్-14, 17 బాలబాలికలుకు క్రీడా పోటీలు కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశానికి జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీనివాసకుమార్, సుధారాణి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఎండీ షరీఫ్, కాకినాడ అర్బన్ ఎంఈవో రవి, కాకినాడ రూరల్ ఎంఈవో టీవీఎస్ రంగారావు హాజరయ్యారు. వారు జాతీయ పతాకానికి గౌరవవందనం చేసి పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆర్చరీ, సెపక్‌తక్రా, గట్కా క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కాకినాడ జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు, కార్యదర్శి వి.మాచారిరావు, కోశాధికారి నాగలింగేశ్వరరావు పాల్గొన్నారు.



ఆర్చరీ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు



చెట్ల నుంచి గెలలు సేకరిస్తున్న కార్మికుడు

ఆ వేతన..

- పామాయిల్ గెలల కోత కార్మికులకు చాలీచాలని కూలీ
- కుటుంబాన్ని పోషించేందుకు తప్పని ఆర్థిక భారం
- తరచూ ప్రమాదాలకు గురవుతున్న వైనం
- పట్టించుకోని రైతులు, ప్రభుత్వం

జగ్గంపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మనం నిత్యం వినియోగించే పామాయిల్ నూనె ముడిసరుకుకు వాడే పామాయిల్ గెలలను తీసే కోత కార్మికులు ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉంది. సరైన కూలీ (వేతనం) అందక ఇబ్బందులకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళితే... కాకినాడ జిల్లా జగ్గంపేట నియోజకవర్గంలో పామాయిల్ కోత కార్మికులు దాదాపుగా రెండు వేల మంది వరకు ఉన్నారు. వీరంతా చాలీచాలని కూలీలతో వారి కుటుంబాలను నెట్టుకొస్తు న్నారు. ఇటీవలకాలంలో ఉభయగోదావరి జిల్లాలతో పాటు అల్లూరి జిల్లా మన్యం ప్రాంతాలలో అధికశాతం పామాయిల్ తోటలు వేయడంతో పాటు కర్నాటక రాష్ట్రంలో కూడా ఈ పంటను పండించటం జరుగుతోంది. ప్రతి ఇంటికీ నిత్యవసర వస్తువుగా పామాయిల్ అవసరం కాబట్టి దీన్ని ఆసరాగా తీసుకుని రాష్ట్రంలోని ఉభయ గోదా వరి జిల్లాలతో పాటు ఏజెన్సీలో విద్యుత్ బోర్లు, వర్షాధారంగా ఈ పంటను సాగుచేస్తు న్నారు.గత రెండుసంవత్సరాల నుంచి ఈ పామాయిల్ ధర టన్ను రూ. 16 వేలు నుంచి రూ20 వేలు వరకూ నడుస్తూ ఉంది. అయితే ఈ పామాయిల్ గెలలను చెట్టు నుంచి వేరు చేసి ఫ్యాక్టరీకి తరలించడానికి నైపుణ్యం గల కార్మికులు అవసరం అవుతారు. దీనిలో భాగంగా జగ్గంపేట నియోజకవర్గంలో పామా యిల్ కోత కార్మికులు ఈ వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. తమ తాతలు, తండ్రుల నుంచి వారసత్వంగా ఈ వృత్తినే నమ్ముకుని ఉన్నారు. రోజుకి రూ. 700 కూలీ మాత్రమే కిడుతుందని వారు అంటున్నారు. పామాయిల్ ధరలు పెరుగుతూ రైతులు, పరిశ్రమలు లాభాల బాటలో ఉన్నారు. కానీ తమ ప్రాణాలకు తెగించి చెట్టు నుంచి గెలలను వేరుచేసే సమయాల్లో పాము కాట్లకు, విద్యుత్‌వైర్లు తగిలి ప్రాణాలు కోల్పోతున్నారు. వీరికి ఎటువంటి బాసట లేకపోవడంతో వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయని పలువురు కార్మికులు వాపోతున్నారు.



ప్రమాదాల బారిన పడుతున్నాం

- టేకుమూడి వీరబాబు, సంఘం ప్రెసిడెంట్

ఉభయ గోదావరి జిల్లాలే కాకుండా, ఇతర రాష్ట్రాలకు కూడా పామాయిల్ గెలలు కోతకు వెళుతుంటాం. ఇలా గెలలో కోసే క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నాం. దీంతో మా కుటుంబాలు వీధిన పడుతున్నాయి. ప్రభుత్వం మా కార్మికులకు బీమా సౌకర్యంతో పాటు ఆర్థిక భరోసా కల్పించాలి.

పరిశ్రమలను భాగస్వామ్యం చేయాలి

- పిల్లి శ్రీను, సంఘం ఉపాధ్యక్షుడు



మేము ప్రమాదాల బారిన పడినప్పుడు రైతు ఎంతో కొంత సాయం చేస్తున్నారు. అలాగే పరిశ్రమలు, ప్రభుత్వం కూడా ఈ సాయం అందించడంతో పాటు మాకు భద్రత కల్పించాలి. అప్పుడే మేము కొంత వరకు ఆర్థిక భారం నుంచి ఉపశమనం పొందగలుగుతాం.

అంతర్వేది హుండీ ఆదాయం

రూ. 35,62,444 లక్షలు



స్వామివారి హుండీని లెక్కిస్తున్న దేవస్థానం సిబ్బంది, తదితరులు

అంతర్వేది, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది పుణ్యక్షేత్రంలో కొలువైన శ్రీలక్ష్మీనరసింహస్వామి హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. జిల్లా దేవాదాయ శాఖాధికారి బీ.సత్యనారాయణ పర్యవేక్షణలో అమలాపురం తనిఖీ అధికారి జే.రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగింది. మొత్తం 83 రోజులకు గాను ప్రధాన ఆలయ హుండీ ద్వారా రూ. 35,07,678 లక్షలు, గుర్రాలక్కమ్మ అమ్మవారి హుండీ ద్వారా రూ.14,679 వేలు, అన్నదాన హుండీ ద్వారా రూ.40,087 వేలు, మొత్తం రూ.35,62,444 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్ తెలిపారు.

అలాగే నాలుగు గ్రాముల బంగారం, 39 గ్రాముల వెండి వస్తువులు, పలు దేశాల విదేశీ కరెన్సీ వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బైరా నాగరాజు, సర్పంచ్ కొండా జాన్‌బాబు, సూపరింటెండెంట్ విజయసారథి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి సెపక్‌తక్రా పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో రాష్ట్ర శాప్ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్

దేవరపల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి మండలం రామన్నపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం జిల్లాలోని సబ్ జూనియర్ బాలురు, బాలికల సెపక్‌తక్రా పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లా జట్టుకు విద్యార్థులను ఎంపిక చేసినట్టు రాష్ట్ర శాప్ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్ తెలిపారు. వీరంతా ఈనెల 13, 14 తేదీల్లో అనంతపురం జిల్లా ఉరవకొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. బాలుర విభాగంలో .. కే.అభిలాష్ (దొమ్మేరు), జే.ప్రకాశ్ (రామన్నపాలెం), వీ.హర్ష (చిన్నాయిగూడెం) ఎస్‌జీ శ్రీరామ్ (చిన్నాయిగూడెం), బాలికల విభాగంలో.. ఎం.తేజస్వి (రామన్నపాలెం), డీ.అంజలి (రామన్నపాలెం), కే.సాయి శ్రీలక్ష్మి (రామన్నపాలెం), నీరజ (చిన్నాయిగూడెం),కే.స్రవంతి (చిన్నాయిగూడెం) ఉన్నారు. కార్యక్రమంలో రామన్నపాలెం పీఈటీ సరస్వతి, పలు స్కూళ్ల పీఈటీలు, తదితరులు పాల్గొన్నారు.

గడ్డి మందు తాగి ఒకరి మృతి

కె.గంగవరం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కే. గంగవరం మండలంలోని సుందరపల్లిలో గురువారం గడ్డి మందు తాగి కుంచెనపల్లి గనిరాజు (47) మృతిచెందాడు. పామర్రు ఎస్‌ఐ ఎస్‌కే జానీబాషా తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గనిరాజు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇతడి మానసికస్థితి సరిగా లేకపోవడంతో అమలాపురంలో చికిత్స పొందుతున్నాడు. కాగా, ఇటీవల కొన్ని రోజులుగా చికిత్స చేయించకోవడం మానేశాడు. ఈ నేపథ్యంలో వ్యవసాయ పనులు సరిగ్గా చేయలేకపోతున్నానని తీవ్ర మనస్థాపం చెంది బుధవారం గడ్డిమందు తాగాడు. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కాకినాడ జీజీహెచ్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

22 నుంచి విజయదుర్గా పీఠంలో దేవీ నవరాత్రులు



వెదురుపాక విజయ దుర్గా అమ్మవారు

రాయవరం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాయవరం మండలం వెదురుపాక విజయ దుర్గా పీఠంలో ఈనెల 22 వ తేదీ నుంచి వచ్చేనెల రెండు వరకు దేవీ శరన్నవ రాత్రులు నిర్వహిస్తున్నట్టు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు విలేకరులకు తెలిపారు. గురువారం పీఠంలో పీఠాధిపతిగాడ్ చేతులమీదుగా ఉత్సవాల కరపత్రాన్ని విడుదల చేశారు. అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు మాట్లాడుతూ 2వ తేదీ ఉదయం 8:19 నిమిషాలకు గురుహోరలో అమ్మవారి మూలవిరాట్ వద్ద కలశ స్థాపనతో పూజలలు ప్రారంభమౌతాయన్నారు. ప్రతిరోజూ అమ్మ వారికి భక్తులచే సామూహిక శ్రీచక్ర కుంకుమార్చనలు, ఉదయం 9 గంటలకు సప్తశతి పారాయణ, 10 గంటలకు దేవీ భాగవత ప్రవచనాలు, సాయంత్రం నాలుగు గంటలకు శ్రీలలితా సహస్ర నామ పారాయణ, సాయంత్రం అమ్మవారికి సువాసినీల పూజ, చతుర్వేదస్వని, నీరాజన మంత్రపుష్పాలు, మహానివేదన ఉంటాయని చెప్పారు. భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

అది ఆకతాయి చర్యే

- ఎటువంటి మతపరమైన ఉద్దేశాలు లేవు
- కేవలం మతపరమైన జెండాలనే ప్రదర్శించారు
- మతసామరస్యాన్ని కాపాడేందుకు ముస్లింల కృషి
- ముస్లిం జేఏసీ ప్రతినిధి జవహర్ అలీ



కాకినాడలో విలేకరులతో మాట్లాడుతున్న ముస్లిం జేఏసీ ప్రతినిధి జవహర్ అలీ

కాకినాడ, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఈనెల 5న మిలాద్ ఉన్ నబీ సందర్భంగా జరిగిన ర్యాలీలో మత విద్వేషాలు రెచ్చగొట్టే చర్యలేవీ జరగలేదని, కొందరు యువకులు ఆకతాయిగా జెండాలను ప్రదర్శించారని ముస్లిం జేఏసీ ప్రతినిధి జవహర్ అలీ వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన గురువారం కాకినాడలో ఆయన ముస్లిం జేఏసీ నాయకులతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ర్యాలీలో యువకులు ప్రదర్శించిన జెండా కేవలం మతపరమైనవి తప్ప, పాకిస్థాన్, పాలస్తీనా జెండాలు ఏ మాత్రం కావని తెలిపారు. ర్యాలీ పూర్తిగా శాంతియుతంగా, సామరస్యపూర్వకంగా జరుగుతున్న సమయంలో కొందరు యువకులు తమకు తెలియకుండానే వీటిని ప్రదర్శించారని అన్నారు. కాకినాడలో ముస్లింలు ఎప్పటికీ దేశద్రోహం, విద్రోహ శక్తులకు అనుకూలంగా నిలబడే పరిస్థితి ఉండదని జవహర్ అలీ స్పష్టం చేశారు. పోలీసులు సోషల్ మీడియాలో వచ్చిన వీడియోల ఆధారంగా కేసులు నమోదు చేశారని, ఎఫ్‌ఐఆర్‌లో వేసిన సెక్షన్లు 302 అండ్ 298, 126, 339, 281, 279ను తాము తీవ్రమైనవాటిగా పరిగణిస్తున్నామన్నారు. ప్రపంచంలో 96 ఇస్లామిక్ దేశాలు న్నాయని, వాటికి సంబంధించి చంద్రుడు, చుక్క ఉన్న జెండాలు ప్రతి ముస్లింల ఇంట, మసీదుల వెంట ఉంటాయని మీడియాకు వివరించారు. పాలస్తీనాలో జరిగిన సంఘటనలకు మద్దతుగా మాత్రమే ఆ యువకులు తిరిగారని వెల్లడించారు. ఆకతాయి చర్యలుగా యువకులు తిరగడాన్ని తాము సమర్థించబోవడం లేదన్నారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని సోషల్ మీడియాలో తమను దేశద్రోహులుగా, విద్రోహ శక్తుల ప్రతినిధులుగా చిత్రీకరించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని స్పష్టం చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

-18 సెల్‌ఫోన్లు, 200 నాణేలు, నగదు స్వాధీనం

కాకినాడ క్రైం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా పేకాడుతున్న 18 మందిని కాకినాడ త్రీటౌన్ పోలీసులు గురువారం రాత్రి అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.8,560 నగదు, సుమారు 200 నాణేలు, 18 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కాకినాడ జిల్లా కాకినాడ నగరంలోని పల్లంరాజు నగర్‌లో పవన్ గార్డెన్స్ అపార్ట్‌మెంట్స్ ఫ్లాట్ నెం.4లో జూదమాడుతున్నారని వచ్చిన పక్కా సమాచారంతో త్రీటౌన్ పోలీసులు, స్పెషల్ బ్రాంచి పోలీసులు దాడి చేసి అరెస్టు చేశారు. అనంతరం వారి నుంచి నగదు, నాణేలు, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

కాపర్ వైర్ దొంగతనం.. ముగ్గురి అరెస్ట్

తొండంగి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి: ఒంటిమామిడి దివిస్ పరిశ్రమలో 1700 కిలోల కాపర్ వైర్ దొంగతనం చేసిన ముగ్గురిని గురువారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచినట్టు తొండంగి పోలీసులు తెలిపారు. దివీస్ ప్రతినిధులు ఈనెల 6న ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేయగా పరిశ్రమలో పనిచేస్తున్న బీహార్‌కు చెందిన బిట్టుకుమార్, అభిషేక్ కుమార్, దీపక్‌కుమార్ చోరీకి పాల్పడినట్టు తేలిందన్నారు. రాత్రివేళ పలు దఫాలుగా రాగి తీగలను గోడపక్కన పడవేసి, తద్వారా వ్యాన్ సాయంతో స్థానికంగా స్క్రాప్ షాపు నడుపుతున్న వ్యక్తికి అమ్మేశారన్నారు. దీనిపై దర్యాప్తు జరిపి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు వారు తెలిపారు. తొండంగి ఎస్‌ఐ జగన్మోహన్ కేసు దర్యాప్తు చేస్తున్నారన్నారు.

అటవీ అమరవీరులను స్మరించుకోవాలి



అమరవీరులకు నివాళులర్పిస్తున్న అటవీఅధికార్లు, ఉద్యోగులు

సంస్మరణ దినోత్సవంలో రాజమహేంద్రవరం సీసీఎఫ్ మూర్తి

దివాన్‌చెరువు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రకృతి సంపదను కాపాడడం కోసం ప్రాణ త్యాగం చేసిన అటవీ అమరవీరులను ప్రతీఒక్కరు స్మరించుకోవాలని రాజమహేంద్రవరం సీసీఎఫ్ బీఎస్ఎన్ మూర్తి అన్నారు. లాలాచెరువు సమీపంలోని గోదావరి మహా పుష్కరవనంలో అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పుష్కరవనంలోని అమరవీరుల స్థూపాల వద్ద సీసీఎఫ్ మూర్తి, దివాన్‌చెరువు సమీపంలోని రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్ బి.విజయకుమార్, జిల్లాలోని అటవీ అధికార్లు, ట్రైనీలతో కలసి అమరవీరులకు నివాళులర్పించారు. స్మారక స్థూపాల వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచారు. అనంతరం సీసీఎఫ్ మూర్తి మాట్లాడుతూ అటవీ సంపదను కాపాడడంలో అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. విజయకుమార్ మాట్లాడుతూ సహజ వనరులను రక్షించడానికి అమరవీరులు చేసిన త్యాగాలను గుర్తు చేశారు, వాటిని మరువకూడదన్నారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో వి.ప్రభాకరరావు, ఫ్లైయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో శ్రీనివాస్, స్టేట్ సిల్వి కల్చరిస్ట్ శ్రీనివాస్, ఎఫ్ఆర్‌వో దావీదురాజు నాయుడు, డిప్యూటీ రేంజ్ అధికారి చల్లా శ్రీనివాసరావు, అటవీ ఉద్యోగులు, అటవీ అకాడమీలోని డిప్యూటీ డైరెక్టర్లు, ట్రైనీలు, ఫ్యాకల్టీ పాల్గొన్నారు.

ఫారెస్ట్ అకాడమీ డైరెక్టర్ విజయకుమార్ బదిలీ

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఏపీ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఏపీఎఫ్‌డీసీఎల్) రీజనల్ మేనేజర్‌గా ఎస్.శ్రీకాంత్‌రెడ్డి నియమితులయ్యారు. ఆయన ఇంతవరకూ ఫారెస్ట్ రీసెర్చ్ అండ్ ఐటీ విభాగం చీఫ్ కన్జర్వేటర్‌గా పనిచేశారు. ఇక ఇక్కడ ఏపీ ఫారెస్ట్ అకాడమీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న బి.విజయకుమార్‌ను శ్రీశైలం ఫారెస్ట్ టైగర్ సర్కిల్ డైరెక్టర్‌గా నియమించారు.

పాము కాటుతో రైతు మృతి

అడ్డతీగల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): అడ్డతీగల మండలం దాకోడు గ్రామానికి చెందిన గిరిజన రైతు పొడుగు ప్రసాద్(41) పాముకాటుతో మృతి చెందాడు. ప్రసాద్ బుధవారం తన పొలంలో పనిచేసుకోవడానికి వెళుతుండగా మార్గమధ్యంలో పాముకాటేసింది. వెంటనే సహచరులు అతడిని దుప్పులపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా వైద్యులు పరిశీలించి ప్రసాద్ అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు.

పీఎఫ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి




వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న యూనివర్శిటీ అధికారులు

ప్రాంతీయ కమిషనర్ వెంకటేశ్వర్లు

దివాన్‌చెరువు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ ద్వారా అందిస్తున్న సేవలపై అవగాహన పెంచుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలని పీఎఫ్ ప్రాంతీయ కమిషనర్ కె.వెంకటేశ్వర్లు అన్నారు. ఆదికవి నన్నయ వర్శిటీలో ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజనపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వర్శిటీలోని సిబ్బంది అందరూ పీఎఫ్‌లో భాగస్వాములవ్వాలని,దాని ద్వారా సొమ్ము ఆదా చేసుకోవడమే కాకుండా బీమా, పెన్షన్ ప్రయోజనాలు ఉన్నాయని చెప్పారు. వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజనకు రూ.లక్ష వరకూ వేతనం పొందే ఉద్యోగులు అర్హులన్నారు. ఈ సందర్భంగా వర్శిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఎ.మట్టారెడ్డి, సిబ్బంది వెంకటేశ్వర్లు సన్మానించారు. అనంతరం వీసీ ప్రసన్నశ్రీని మర్యాదపూర్వకంగా కమిషనర్ కలవగా మాట్లాడుతూ ఈపీఎఫ్‌తో సిబ్బందికి మేలు కలిగే పలు అంశాలను చర్చించారు.

ఇంటి దొంగ అరెస్ట్

183 గ్రాముల బంగారు ఆభరణాలు రూ.లక్ష నగదు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నాగదుర్గారావు

కాకినాడ క్రైం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నమ్మకంగా పని చేస్తుందని ఎటువంటి నిఘా లేకుండా ఇల్లంతా ఆ పని మనిషికి అప్పగించి వృద్ధురాలైన ఆ యజమాని తన పని తాను చేసుకుంటోంది. ఆమె ఆదమరుపుగా ఉన్న సమయంలో పనిమనిషి ఆ ఇంటిలో ఉన్న 183 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.1 లక్ష నగదు అపహరించుకుపోయింది. కట్ చేస్తే కాకినాడ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఉంది. సీఐ ఎం.నాగదుర్గారావు గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ బాలాజిచెరువు సెంటర్ సమీపంలోని కొమ్మిరెడ్డి వారి వీధిలో 60 ఏళ్ల బత్తుల కనకదుర్గ, ఆమె కుమార్తె ప్రశాంతి నివాసం ఉంటున్నా రు. ఈ నెల 2న ఆ ఇంటిలో 277 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.1 లక్ష నగదు అపహరణకు గురైనట్టు కనకదుర్గ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఐ నాగదుర్గారావు, క్రైం సీఐ వి.కృష్ణ బృందంతో కలిసి దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజీల ఆధారంగా ఆ ఇంటి పని మనిషిని నిందితురాలిగా నిర్ధారించారు. గురువారం స్థానిక జగన్నాథపురం, మరిడమ్మపేటకు చెందిన పని మనిషి వనమాడి జగదాంబను ఆమె ఇంటి వద్ద అదుపులోకి తీసుకుని విచారించారు. కనకదుర్గ ఇంట్లోని డబుల్ కాట్ మంచానికి అమర్చిన సీక్రెట్ సొరుగులో ఆమె విలువైన వస్తువులు భద్రపరుస్తుండడాన్ని చాలాకాలంగా జగదాంబ గమనించేది. ఈ నెల 2న ప్రశాంతి బయటకు వెళ్లగా కనకదుర్గ పని చేసుకుంటోంది. ఆ సమయంలో జగదాంబ దొంగతనానికి పాల్పడింది. అయితే బాధితులు ఆందోళనలో ఉండి ఫిర్యాదులో 277 గ్రాముల బంగారం చోరీకి గురైనట్టు తెలిపిందని అయితే 94 గ్రాముల బంగారం కనకదుర్గ ఇంటిలో భద్రంగానే ఉన్నట్టు గుర్తించామన్నారు. నిందితురాలిని అరెస్ట్ చేసినట్టు సీఐ తెలిపారు.

డొంకరాయి నుంచి నీటి విడుదల నిలుపుదల



డొంకరాయి జలాశయం నుంచి నీటిని నిలుపుదల చేసిన దృశ్యం

జెన్‌కో అధికారులు

మోతుగూడెం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని డొంకరాయి జలాశయం నుంచి నీటి విడుదలను గురువారం ఉదయం నుంచి నిలిపివేసినట్టు కాంప్లెక్సు పరిధిలోని జెన్‌కో అధికార్లు తెలిపారు. అల్పపీడన ప్రభావంతో ఇటీవల ఈ ప్రాంతంలో కురిసిన భారీవర్షాలకు డొంకరాయి జలాశయం పూర్తిస్థాయికి చేరుకుంది. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1037 అడుగులుగా కాగా ఈ నెల 5 నాటికి 1035.60 అడుగులకు చేరడంతో జలాశయం నీటి మట్టం పూర్తిస్థాయి చేరుకుంటే ప్రమాదమని భావించి స్థానిక జెన్‌కో అధికార్లు ముందస్తు చర్యల్లో భాగంగా 5వ తేదీ రాత్రి జలాశయం 6వ గేటు ఎత్తి దిగువకు 3 వేలు క్యూసెక్కుల నీటిని విడుదల చేసి నీటి మట్టం 1034 అడుగుల వద్ద స్థిరంగా కొనసాగేలా చర్యలు చేపట్టారు. 4రోజులుగా ఈ ప్రాంతంలో వరద తగ్గుముఖం పట్టింది. దీంతో గురువారం ఉదయం నాటికి డొంకరాయి జలాశయం నీటిమట్టం 1033.90 అడుగులకు తగ్గడంతో నీటి విడుదలను గురువారం ఉదయం నుంచి నిలిపివేసినట్టు జెన్‌కో అధికారులు తెలిపారు. ఈ నెల 5నుంచి 11వ తేదీ ఉదయం వరకు 759 టీఎం సీల నీటిని దిగువకు విడుదల చేశామని తెలిపారు.అలాగే డొంకరాయి జలాశయం నుంచి పొల్లూరు జల విద్యుత్ కేంద్రానికి విద్యుత్ ఉత్పత్తి కోసం 3519 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్టు జెన్‌కో అధికార్లు తెలిపారు. అల్పపీడన ప్రభావంతో ఇటీవల సీలేరు నదీ పరివాహక ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు సీలేరు కాంప్లెక్సు లోని జలాశయాలకు నీటిని సరఫరా చేసే ఆంధ్రా ఒడిశా ఉమ్మడి జలాశయమైన బలిమెల జలాశయంలో ఆంధ్రా వాటాగా గురువారం నాటికి 45.9236 టీఎంసీలు, సీలేరు డొంకరాయి జలాశయాల్లో 12.9701 టీఎంసీలుతో కలుపుకుని మొత్తంగా 58.8937 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయని జెన్‌కో అధికారులు తెలిపారు. గురువారం సీలేరు కాంప్లెక్సులోని జల విద్యుత్ కేంద్రాల్లో గ్రిడ్ అధికార్ల ఆదేశాలతో 3.7038మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరిగిందని స్థానిక అధికార్లు తెలిపారు.

వలసపాకల యూఆర్సీ క్యాంటీన్‌లో వివాదం

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం వలసపాకల యూనిట్ రన్ క్యాంటీన్ (యూఆర్సీ)లో పనిచేస్తున్న మేనేజర్, ఓ ఉన్నతాధికారి మధ్య తలెత్తిన వివాదం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసే వరకు వెళ్లింది. వివరాల్లోకెళితే... కాకినాడ జిల్లాలో పని చేస్తున్న ఆర్మీ సిబ్బంది, రిటైర్డు ఆర్మీ ఉద్యోగస్థులకు రాయితీపై నిత్యావసర సరుకులు, ఎలక్ట్రిక్ పరికరాలను వలసపాకలలో ఏర్పాటుచేసిన ఆర్మీ క్యాంటీన్‌లో పంపిణీ చేస్తారు.కాకినాడకు చెందిన ఆర్మీ ఉన్నతాధికారి ఆగస్టు 22న క్యాంటీన్‌ని సందర్శించిన సమయంలో దాని నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేసి, తనపై అకారణంగా ఆగ్రహం వ్యక్తం చేసినట్టు అక్కడ పని చేస్తున్న మేనేజర్.. సన్నిహితులు, సహచార ఉద్యోగస్థుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు.ఏ తప్పు చేయకపోయినా తనపై ఆ అధికారి దురుసుగా ప్రవర్తించడంతో వారం క్రితం రాజీనామా చేశారు. రాజీనామా వెనక్కి తీసుకోవాలని రిటైర్డు ఆర్మీ సంఘం నాయకులు సదరు మేనేజర్‌కు సంఘీభావం తెలపడంతో రాజీనామా వెనక్కి తీసుకుంటున్నట్టు మేనేజర్ సికింద్రాబాద్‌లోని ఆర్మీ సెంట్రల్ హెడ్ క్వార్టర్‌కి సమాచారం అందించి, విధుల్లో చేరే నిమిత్తం ఆర్మీ క్యాంటీన్‌లో విధులు నిర్వర్తించేందుకు వచ్చినా సదరు అధికారి అడుకోవడంపై మేనేజర్ ఆందోళన వ్యక్తం చేశారు. తన రాజీనామా ఆమోదించినట్టు తనకు హెడ్ క్వార్టర్స్ నుంచి ఎటువంటి ఉత్తర్వులు అందలేదని, అయినప్పటికీ సదరు కల్నల్ తనను అడ్డగిస్తూ వేధింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు 8 మంది



రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్, చెస్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

బిక్కవోలు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు బిక్కవోలు నుంచి నలుగురు బాలురు, నలుగురు బాలికలు ఎంపికయ్యారని బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ మండలాధ్యక్షుడు ఐ.శశిభూషణం గురువారం తెలిపారు.ఇటీవల గొల్లల మామిడాడలో జరిగిన జిల్లా స్థాయి అండర్-19 పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. ఎంపికైన వారిలో దుళ్ల అలేఖ్య, బండారు చాందినిశ్రీయ, రొంగల శిరీష, బూడి భార్గవి, విసినిగిరి హేమంత్, కైలాష్, తొండాపు వీరమణికంఠ, గుత్తుల నాగవినయ్ ఉన్నారు. వారు ఈ నెల 12 నుంచి 14 వరకూ అనంతపురం జిల్లా ధర్మవరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికైన బాలబాలికలను అసోసియేషన్ సభ్యులు చైతన్య, నరేంద్ర, కృష్ణ ప్రసాద్, మోహన్ అభినందించారు.

చెస్ పోటీలకు ఇద్దరు ...

పందలపాక జడ్పీ ప్లస్ పాఠశాల నుంచి ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్-19 చెస్ పోటీలకు ఇద్దరు విద్యార్థినులు ఎంపికయ్యారని హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇటీవల రాజమహేంద్రవరంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో పి.లీలాస్వాతి, జి.విమల ప్రతిభ కనబరచిన రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు.ఈ సందర్భగా విద్యార్థినులతోపాటు పీడీ యువరాజారెడ్డిని హెచ్‌ఎం, ఎస్‌డీసీ ఛైర్మన్ కోణాల సత్తిరాజు, ఎస్ఎంసీ ఛైర్మన్ పంపన వీరసత్యానారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు.

బైక్ చోరీ చేస్తూ గ్రామస్థులకు చిక్కిన దొంగ

రాజానగరం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోనగూడెంలో బైక్ చోరీకి పాల్పడుతూ ఒక దొంగ గ్రామస్థులకు చిక్కడంతో అతడికి దేహశుద్ధి చేసి, నిర్బంధించారు. గ్రామంలోని టీ దుకాణం వద్ద పార్క్ చేసిన బైక్ చెంతన ముగ్గురు యువకులు అనుమానాస్పదంగా సంచరించడాన్ని గమనించారు. కొంతసేపటికి తాళం తీసేందుకు ప్రయత్నిస్తుండగా దొంగను పట్టుకునేందుకు ప్రయత్నించగా ఇద్దరు పరారుకాగా ఒకడు పట్టుబడ్డాడు. అతడికి గ్రామస్థులు దేహశుద్ధి చేశారు. ఎన్ని విధాలుగా భయపెట్టినప్పటికీ నోటి నుంచి సరైన సమాధానం రాబట్టలేకపోయారు. చేసేది లేక పోలీసులకు సమాచారం అందించారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

ఎస్సీ కార్పొరేషన్ చెరువుల పరిశీలన

తాళ్లరేవు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): చొల్లంగి ఎస్సీ కార్పొరేషన్ పౌల్ట్రీ కాంప్లెక్స్‌లోని చేపల చెరువులను రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్లు చెల్లి అశోక్, కొల్లాబత్తుల అప్పారావు, ముద్దా మణి గురువారం పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. చొల్లంగి పేట అంబేద్కర్ గురుకుల పాఠశాలను సందర్శించి వసతులను పరిశీలించారు. విద్యార్థులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు.

రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు పిఠాపురం క్రీడాకారుల ఎంపిక

పిఠాపురం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఆర్చరీ రాష్ట్ర స్థాయి పోటీలకు పిఠాపురానికి చెందిన ఎనిమిది మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఆర్చరీ పోటీలు కాకినాడలోని స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో గురువారం జరిగాయి. పిఠాపురంలో శిక్షణ పొందిన కె.అలేఖ్య, ఎస్‌కే లతీఫా ఇండియన్ రౌండ్ అండర్-14 బాలికల విభాగంలో, బి.జయదీప్, సీహెచ్ లోహిత్ బాలుర విభాగంలో, కె.సుహాసిని, ఎస్కే. హమీదాలు అండర్-17 బాలికలు, జేఆర్ అరుణ్, ఆదిత్య బాలుర విభాగాల్లో ఎంపికయ్యారు. వీరంతా త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని కోచ్ పి.లక్ష్మణరావు తెలిపారు.

అక్రమ వ్యాపారాల నివారణకు 8712631287

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అక్రమ వ్యాపార కార్యకలాపాల నిరోధానికి ప్రత్యేకంగా 8712631287 వాట్సాప్ నెంబరును అందుబాటులోకి తీసుకొచ్చామని... వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ డైరెక్టర్ డి.శ్రీలక్ష్మి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాకినాడ డివిజన్ పరిధిలో ఎక్కడైనా అక్రమ వ్యాపార లావాదేవీలు జరిగితే వెంటనే సంబంధిత వాట్సాప్ నెంబర్‌కి కాల్ చేసి సమాచారం అందించి సహకారం అందించాలని కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు అరట్లకట్ట విద్యార్థినుల ఎంపిక

కరప, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు మండలం లోని అరట్లకట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థినులు ఎంపికైనట్టు హెచ్ఎం వి.శ్రీనివాస్‌కుమార్ తెలిపారు. రాజమహేంద్రవరంలో బుధవారం జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-17 ఫుట్‌బాల్ గర్ల్స్ విభాగంలో పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థినులు సృజన, అపర్ణ, మాలాశ్రీ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 22న కర్నూలులో జరిగే రాష్ట్ర పోటీల్లో వీరు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జట్టు తరపున ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు. విద్యార్థినులు, వారికి తర్ఫీదునిచ్చిన పీడీ జీజేఆర్ఎస్ కౌర్‌లను ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసకుమార్‌తో పాటు ఎస్ఎంసీ చైర్మన్, సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు.

కాళ్లు కోల్పోయిన వివాహితకు 'తదేకం' ఫౌండేషన్ రూ.లక్ష వితరణ

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట దంటువుంత ప్రాంతానికి చెందిన సారిపల్లి జ్యోతి ఇటీవల సామర్లకోటలో జరిగిన రైలు ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయారు. ఈమె ఇబ్బందిని గుర్తించిన కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే పంతం నానాజీ వద్దకు వెళ్లి సహాయం కోరగా తదేకం ఫౌండేషన్ నిర్వాహకులతో మాట్లాడగా వారు సానుకూలంగా స్పందించారు. గురువారం ఎమ్మెల్యే పంతం నానాజీ పుట్టినరోజును పురస్కరించుకుని తదేకం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గొడారిగుంటలో సారిపల్లి జ్యోతికి రెండు కృత్రిమ కాళ్ల ఏర్పాటు కోసం అవసరమైన రూ.లక్ష చెక్కును సంస్థ ప్రతినిధులు అందజేశారు. తమ కుమార్తె కృత్రిమ కాళ్ల కోసం సహకారం అందించిన ఎమ్మెల్యే నానాజీ, తదేకం ఫౌండేషన్ ప్రతినిధులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

'తెలుగు ప్రజలను సురక్షితంగా తీసుకురావడంలో లోకేశ్ విశేష కృషి'

కాకినాడ సిటీ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నేపాల్‌లో జరిగిన దారుణ ఘటనలో చిక్కుకున్న తెలుగు ప్రజలను స్వస్థలాలకు సురక్షితంగా తీసుకురావడంలో మంత్రి నారా లోకేశ్ చూపించిన మానవతా దృక్పథం, కృషి అభినందనీయమని టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ పేర్కొన్నారు. గురువారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. లోకేశ్ అనంతపురం పర్యటన రద్దు చేసుకుని హుటాహుటిన సచివాలయానికి చేరుకుని రియల్‌టైమ్ గవర్నెన్స్‌ను వార్ రూమ్‌గా మార్చి సహాయక చర్యలను సమన్వయం చేసిన తీరు ఆయన మానవతా హృదయాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. బాధితులతో స్వయంగా మాట్లాడి ధైర్యం చెప్పడం, లొకేషన్ కో-ఆర్డినేట్లతో మ్యాప్ సిద్ధం చేయించారన్నారు. ఢిల్లీలోని ఏపీ భవన్‌లో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయించడం, బాధితులకు ఆహారం, నీరు, వసతి సదుపాయాలు కల్పించడం వంటి ప్రతి చర్యలోనూ ప్రజల పట్ల ఆయన తపన కనిపించిందన్నారు.

కాకినాడ కస్టమ్స్ బ్రోకర్స్ అసోసియేషన్

నూతన అధ్యక్షుడిగా సత్యనారాయణ



కాకినాడ సిటీ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ కస్టమ్స్ బ్రోకర్స్ అసోసియే షన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానికంగా జరిగిన అసోసియేషన్ 48వ వార్షిక కార్యవర్గ సమావేశంలో రెండేళ్ల పదవీ కాలానికి నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. 17 సంవత్సరాలుగా అసోసియేషన్ అధ్యక్షుడిగా కొనసాగుతున్న అశోక్ ఇంటర్నేషనల్ అధినేత మండవ సత్యనారాయణ తిరిగి అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా శ్రీరామ్ భగవతి, ఉపాధ్యక్షుడిగా ఏవీ చలం, సంయుక్త కార్యదర్శిగా ఆర్.శేషగిరిరావు, కోశాధికారిగా బి.రవి, కార్యవర్గ సభ్యులుగా సి.నరసింహరావు, మురళీకృష్ణ, రమణ, నగష్, వీవీ రావు, కుమార్ ఎన్నికయ్యారు. కాకినాడ పోర్టు నుంచి ఎగుమతి, దిగుమతి లావాదేవీలు ఈ అసోసియేషన్‌లోని సభ్యుల ద్వారా జరుపుతామని నిర్వాహకులు చెప్పారు.

కలెక్టర్‌ను కలిసిన రైస్‌మిల్లర్ల సంఘం నూతన కార్యవర్గం

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా రైస్‌మిల్లర్ల వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం గురువారం కలెక్టర్ షాన్‌మోహన్‌ను కలిసింది. అధ్యక్షుడు వల్లూరి సూర్యప్రకాశరావు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చారు. అసోసియేషన్ కార్యవర్గాన్ని ఆయన కలెక్టర్‌కు పరిచయం చేశారు. కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ రైస్‌మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు సీఎంఆర్ రైస్‌ను సకాలంలో అప్పగించే విధంగా కృషి చేయాలన్నారు. ధాన్యం సేకరణ సమయంలో మిల్లర్లు రైతులకు సహకరించాలన్నారు. అనంతరం నూతన కార్యవర్గానికి కలెక్టర్ అభినందనలు తెలిపారు. జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనాను అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. అసోసియేషన్ కార్యదర్శి మొగలి నాని, కోశాధికారి పెదిరెడ్ల బాబ్జి, ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి భైరవ కృష్ణ, కాకినాడ ఏరియా అధ్యక్షుడు రుద్రయ్యచౌదరి పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారం చేసిన పాలకమండలి సభ్యులు

సీతారామస్వామి ఆలయ పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవం

కాకినాడ సిటీ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మెయిన్‌రోడ్ టౌన్‌హాల్ ఎదురుగా గల పురాతన శ్రీసీతారామస్వామి దేవస్థానం పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవం గురువారం ఘనంగా జరిగింది. చైర్మన్‌గా పులవర్తి విశ్వనాథం, సభ్యులుగా డాక్టర్ తురగా సూర్యారావు, పులవర్తి కుమార్, మారుపల్లి సతీష్, చాట్ల నాగవీరబాబు, తితిడి ఎల్లమ్మ, మిరియాల సుబ్బలక్ష్మి, తమిరి నాగమణి, మాలే వరలక్ష్మి ప్రమాణ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, శ్రీబాలాత్రిపురసుందరి ఆలయ చైర్మన్ గ్రంధి బాబ్జీ, కాకినాడ మార్కెట్ కమిటీ చైర్మన్ బచ్చు శేఖర్, పెద్ద శివాలయం చైర్మన్ పల్ల సురేష్, ఆలయ ఈవో వెంకటేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ ఫణి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షాలో సమన్వయకర్తల ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సమగ్ర శిక్షాకు సంబంధించి ఖాళీగా ఉన్న ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ కో-ఆర్డినేటర్, అసిస్టెంట్ ఆల్టర్నేటివ్ స్కూలింగ్ కో-ఆర్డినేటర్ ఉద్యోగాలకు ప్రభుత్వ, జడ్పీ, మున్సిపాలిటీ యాజమాన్యాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని సమగ్ర శిక్షా ఏపీసీ పి.వేణుగోపాలరావు కోరారు. 5ఏళ్ల సర్వీసు నిండిన స్కూల్ అసిస్టెంట్లు, 8ఏళ్ల సర్వీసు నిండిన ఎస్జీటీలు అర్హులన్నారు. ఆసక్తి గల ఉపాధ్యాయులు ఈ నెల 16వ తేదీలోపు దరఖాస్తులను కాకినాడలోని సమగ్ర శిక్షా కార్యాలయంలో సమర్పించాలన్నారు.

తిమ్మాపురంలో భారీ అన్నసమారాధన

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపురంలో శ్రీసిద్ధి వినాయక ఫ్రెండ్స్ సర్కిల్ నిర్వాహకుడు మాదారపు తాతాజీ ఆధ్వర్యంలో గురువారం భారీ అన్నదానం నిర్వహించారు. సుమారు 10వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. ఎమ్మెల్యే పంతం నానాజీ పుట్టినరోజు సందర్భంగా తాతాజీ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు.

రూరల్ ఎమ్మెల్యే నానాజీ పుట్టినరోజు వేడుకలు



మొక్కలు నాటుతున్న కరప మండల జనసేన నాయకులు



గొల్లప్రోలులో విద్యుత్, తాగునీరు, పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న కూటమి నాయకులు



పెనుగుదురులో చీరలు పంపిణీ చేస్తున్న జనసైనికులు

కరప, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ జన్మదిన వేడుకలను కరప మండల వ్యాప్తంగా జనసేన నాయకులు గురువారం నిర్వహించారు. పెనుగుదురులో కేక్ కట్ చేసి, వృద్ధులు, పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేసి పలు మొక్కలు నాటారు. నడకుదురు జనావళి వృద్ధాశ్రమంలో కేక్ కట్‌చేసి వృద్ధులకు భోజనాలు, పండ్లు పంపిణీ చేశారు. కూరాడలో జనసేన నాయకుడు చోడిశెట్టి ప్రసాద్ ఆధ్వర్యంలో పలువురు గర్భిణులకు పండ్లు, పోషకాహార కిట్లను అందజేశారు. గొర్రిపూడిలో భారీ కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా విద్యుత్, తాగునీటి సిబ్బంది, పారిశుధ్య కార్మికులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కరపలో మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు పండ్లు అందజేశారు. కాకినాడ రెడ్‌క్రాస్ వసతిగృహంలో అనాథ పిల్లలకు భోజన, వసతి ఏర్పాటు చేశారు. జడ్.బావారంలో భారీ కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. పలువురు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో జనసేన నాయకులు ముద్రగడ రమేష్, బండారు మురళి, బోగిరెడ్డి కొండలరావు, బోగిరెడ్డి గంగాధర్, తుమ్మలపల్లి గోవిందరాజులు, రెడ్డిపల్లి నారాయణరావు, దూడల నారాయుడు, జోకా తాతాజీ, సైనవరపు భవానీశంకర్, అనుకుల రాంబాబు, పుణ్యమంతుల అన్నారం, గంటా నానిబాబు, యాళ్ల వీర వెంకట సత్యనారాయణ (పండు), బత్తుల సతీష్, మీసాల రాంబాబు, పేపకాయల పవన్‌కుమార్, పేకేటి దుర్గాప్రసాద్, శాకా వంశీ, బుంగా బాబి, గుణ్ణం శ్రీనివాస్, నక్కా బ్రహ్మాజీ, చెక్కపల్లి మణికంఠ, ఆట్ల వీరబాబు, నాని, కొండలరావు, బండారు రాజు, పేపకాయల తణుకులరాజు తదితరులు పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్ (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. జనసేన రాష్ట్ర కార్యదర్శి సోదె ముసలయ్య ఆధ్వర్యంలో రమణయ్యపేట శ్రావణి ఆశ్రమ వృద్ధాశ్రమం, కొత్తూరు సెంటర్‌లో రెడ్‌క్రాస్ అంధుల పాఠశాలల్లోని వృద్ధులు, విద్యార్థులకు పండ్లు, స్వీట్లు, అన్నదానం పంపిణీ చేశారు. తిమ్మాపురంలో సీనియర్ నాయకుడు మాదారపు తాతాజీ కేక్ కట్ కోసి అందరికీ పంపిణీ చేశారు. వలసపాకల మాజీ ఉప సర్పంచ్ సలాది శ్రీనివాసబాబా ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ అంధ విద్యార్థులకు బిస్కెట్లు, చాక్లెట్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

మోడల్ నియోజకవర్గంగా పిఠాపురం అభివృద్ధి

కాకినాడ ఎంపీ ఉదయశ్రీనివాస్

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల నిర్వహణ ద్వారా పిఠాపురాన్ని దేశంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలనే కృతనిశ్చయంతో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పనిచేస్తున్నారని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ సూచించారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు మెయిన్‌రోడ్డులో గల ఫంక్షన్ హాలులో చేబ్రోలు, దుర్గాడ, ఎ.విజయనగరం, ఏకే, ఏపీ మల్లవరం గ్రామాల్లో ఐదుగురు వంతున కమిటీల ఏర్పాటు నిమిత్తం గురువారం సాయంత్రం ఆయా గ్రామాల నాయకులు, జనసైనికులు, వీరమహిళలతో సమావేశాలు నిర్వహించి అభిప్రాయాలు సేకరించారు. అందరూ కలిసికట్టుగా ఉండి నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమం కోసం పవన్ చేస్తున్న కృషిని ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించాలని చెప్పారు. అదే సమయంలో వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సమావేశంలో జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య భవన్‌లో రక్తదాన శిబిరం

కాకినాడ సిటీ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సీపీఎం అగ్ర నేత సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి వర్ధంతి సందర్భంగా గురువారం సుందరయ్య భవన్‌లో సీపీఎం నగర కమిటీ సభ్యుడు దుంపల ప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని కె. సత్తిరాజు ప్రారంభించారు. సీపీఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు, మలక వెంకటరమణ, నాగాబత్తుల సూర్యనారాయణ, సీహెచ్ సతీష్, సీహెచ్ రాజ్‌కుమార్, ఆర్.వెంకటలక్ష్మి, సీహెచ్ రమణి, జి.భూలక్ష్మిలతో పాటు పలువురు రక్తదానం చేశారు. శిబిరాన్ని కాకినాడ రోటరీ బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కామరాజు పర్యవేక్షించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎం.రాజశేఖర్, కె.వీరబాబు, యు.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'సమస్యలు పరిష్కరించకుంటే నిరసన'

పిఠాపురం రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టకుంటే నిరసన కార్యక్రమాలు చేపడతామని ఏపీ వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ హెచ్చరించింది. పిఠాపురం మండలంలోని సచివాలయ ఉద్యోగులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఈవోపీఆర్డీ రామకృష్ణకు అందజేశారు.

పాడా ఇన్‌చార్జి పీడీగా వేణుగోపాలరావు



పిఠాపురం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (పాడా) ఇన్‌చార్జి ప్రాజెక్టు డైరెక్టరుగా పి.వేణుగోపాలరావు గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం పీడీగా ఉన్న ఎ.చైత్రవర్షిణి మెడికల్ లీవు పెట్టడంతో తొలుత కాకినాడ ఆర్డీవో మల్లిబాబుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. మరలా రెండు రోజుల వ్యవధిలోనే మార్పు చేస్తూ సమగ్ర శిక్ష కాకినాడ జిల్లా ఏపీసీగా ఉన్న డిప్యూటీ కలెక్టర్ వేణుగోపాలరావుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ షాన్‌మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు.

సరస్వతి గానసభ నూతన అధ్యక్షుడిగా

ముళ్ళపూడి నాగేశ్వరరావు

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సరస్వతి గానసభ (సూర్యకళా మందిరం) నూతన అధ్యక్షుడిగా ప్రముఖ చంటి పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్.ముళ్ళపూడి నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. ఇప్పటిదాకా అధ్యక్షుడిగా వ్యవహరించిన కేవీఎస్ ఆంజనేయమూర్తి మరణంతో ఆ పదవికి ఖాళీ ఏర్పడింది. దీంతో గురువారం కార్యవర్గ ప్రత్యేక సమావేశం నిర్వహించి డాక్టర్ ముళ్లపూడిని అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఆయన పేరును సంస్థ జీవితకాల అధ్యక్షుడు కొమ్మిరెడ్డి శ్రీరామపరసింగరావు, కెవివిబి. శర్మలు ప్రతిపాదించగా, సభ్యులంతా ఆమోదించారు. కార్యక్రమానికి సంస్థ ఉపాధ్యక్షుడు లక్కరాజు సత్యనారాయణ్ (టిక్కు) అధ్యక్షత వహించగా గౌరవాధ్యక్షురాలు పెద్దాడ సూర్యకుమారి, కార్యదర్శి పేపకాయల రామకృష్ణ, వెత్సా వీఎస్ సత్యనారాయణ, ఆనంద్, గోపు కాశీవిశ్వనాథ్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కోతకు గురైన కొత్తపట్నం బీచ్ రోడ్డు

కొత్తపల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కెరటాల ధాటికి కొత్తపట్నం వద్ద కోతకు గురైన బీచ్ రోడ్డును జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్చార్జి మర్రెడ్డి శ్రీనివాస్, నాయకుడు డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జనసైనికులు పరిశీలించారు. ఉప్పాడకు వెంటనే రక్షణ గోడ నిర్మించి ఆదుకోవాలని పలువురు మత్స్యకార మహిళలు జనసేన నాయకులకు మొరపెట్టుకొన్నారు. కోత నివారణపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టిసారించారని, గట్టు నిర్మాణానికి రూ.323కోట్లు నిధులు కూడా మంజూరు చేయించారని, త్వరలో ఉప్పాడకు రక్షణ గట్టు నిర్మాణ పనులు చేపట్టనున్నట్టు ఇన్‌చార్జి శ్రీనివాసరావు మత్స్యకారులకు హామీ ఇచ్చారు. కొత్తపట్నం గ్రామంలోకి చేరిన సముద్రం నీటిని తక్షణం తొలగించి సహాయ కార్యక్రమాలు అందించాలని సర్పంచ్ ఉమ్మిడిజాన్, కార్యదర్శి శ్రీనివాస్‌కు ఆయన సూచించారు. పలువురు జనసైనికులు ఇన్‌ఛార్జి శ్రీనివాసరావు వెంట కోత గురైన బీచ్‌రోడ్డును పరిశీలించారు.

కెరటాల ధాటికి కొత్తపట్నంలోకి సముద్రం నీరు ప్రవేశించి ఇబ్బంది పడుతున్న మత్స్యకారులను మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ పరామర్శించారు. గతంలో కొత్తపట్నం వద్ద కెరటాలు దాటిని తట్టుకునేందుకు బండ రాళ్ళు డంప్ చేసి కోత నివారించామన్నారు. ప్రస్తుతం బండ రాళ్ళు కొట్టుకొనిపోవడంతో సముద్రం నీరు స్థానిక పాఠశాలలోకి మునిగిపోయిందని ఆవేదన చెందారు. ఉప్పాడ గ్రామానికి శాశ్వత కోత నివారణ చర్యలు చేపట్టాలని కోరగా మాజీ ఎమ్మెల్యే వర్మ భరోసా ఇచ్చారు.

వైసీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చక్రి



గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వైసీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు ఓరుగంటి చక్రధరుడు (చక్రి) నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. తనకి పదవి ఇచ్చేలా కృషి చేసిన కాకినాడ మాజీ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా, రీజనల్ కో-ఆర్డినేటర్ బొత్స సత్యనారాయణలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సామర్లకోట కుమారరామ భీమేశ్వర ఆలయ

ధర్మకర్తల మండలి నియామకం

సామర్లకోట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయ ధర్మకర్తల మండలి నియామకం పూర్తయ్యింది. 11 మంది సభ్యులతో కమిటీని నియమిస్తూ దేవదాయ శాఖ కమిషనరు కార్యాలయం నుంచి గురువారం సాయంత్రం జీవోఆర్టీ నెం.1047 జారీ అయ్యింది. సభ్యులుగా కంటే జగదీష్‌మోహన్ (బాబు), చీమలకొండ వీరభద్రప్రసాద్ (జ్యోతిష్యవేత్త), తాతపూడి సత్యఅరుణ్‌వంశీ, జి. సత్యనారాయణ, తాతపూడి పవన్‌కుమార్, అలోక్‌చంద్ర జైన్, కంచర్ల సుష్మామోహిని, కొండపల్లి సత్యవాణి, మండపల్లి కానువెంకట పద్మ, బాడితమాని లక్ష్మి, గూనపాటి బుల్లమ్మలను నియమించారు.

కొత్తపల్లి ఎంపీడీవోగా లక్ష్మీరెడ్డి

కొత్తపల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి ఎంపీడీవోగా ఎ.లక్ష్మీరెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. శంఖవరం ఇన్‌చార్జి ఎంపీడీవో పని చేస్తున్న ఆయనకు ఉద్యోగోన్నతి కల్పించారు. ఎంపీడీవో లక్ష్మీరెడ్డిని మండల ప్రజా పరిషత్ సిబ్బంది సాదరంగా ఆహ్వానం పలికారు.

'ప్రగతి'లో వర్క్‌షాప్

గండేపల్లి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ(ఏఐఎంఎల్) విభాగం ఆధ్వర్యంలో తమ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సైబ్రో సెక్యూరిటీ సోల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో ఐవోటీ ఇంటిగ్రేటెడ్ విత్ ఎంఎల్ అనే అంశంపై మూడు రోజుల వర్క్‌షాప్ నిర్వహించామని కళాశాల చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు తెలిపారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

బురదకోటలో వైద్యశిబిరం

ప్రత్తిపాడు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ఎత్తైన కొండలపై ఉన్న బురదకోట గ్రామంలో గురువారం పెద్దిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ యశశ్వి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. బాపన్నదొర, కె.మిర్చివాడ, కొండపల్లిలకు చెందిన గిరిజనులు వైద్య చికిత్సలు పొందారు. డాక్టర్ యశశ్వి బృందం వైద్యచికిత్సలు చేసి మందులు పంపిణీ చేశారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



సింహాచలాన్ని సత్కరిస్తున్న ఐటీడీఏ పీవో స్వరణ్ రాజ్

బదిలీపై వెళుతున్న సింహాచలానికి సత్కారం

రంపచోడవరం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గిరిజనులకు వృత్తి పట్ల నిబద్ధతో సేవలు అందిస్తే మంచి గుర్తింపు ఉంటుం దని ఐటీడీఏ నూతన ప్రాజెక్ట్ అధికారి స్వరణ్‌రాజ్ అన్నారు. ఐటీడీఏ పీవోగా పనిచేసి బదిలీపై వెళుతున్న కట్టా సింహాచలాన్ని ఆయనను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో సబ్ డివి జనల్ పోలీస్ అధికారి సాయిప్రశాంత్, ఏపీవో(జీ) డీఎస్వీ రమణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేడ్కర్, సబ్ డీఎఫ్‌వో అనూష, డిప్యూటీ డైరెక్టర్లు రుక్మాండయ్య, షరీఫ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి ఏపీడీగా శ్రీనివాస విశ్వనాథ్



జిల్లా కలెక్టర్‌కు మొక్కను ఇస్తున్న ఏపీడీ శ్రీనివాస విశ్వనాథ్

రంపచోడవరం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): సిబ్బంది సహకారంతో ఏజెన్సీ ప్రాంతంలో ప్రభుత్వ లక్ష్యం మేరకు ఉపాధిహామీ శ్రామికుల సంక్షేమమే మొదటి ప్రాధాన్యంగా విధులు నిర్వహిస్తానని ఉపాధి హామీ పథకం నూతన ఏపీడీ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. గురువారం పాడేరులో జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్‌ను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2007లో గ్రూప్-1లో ఎంపీడీవోగా ఎంపికై ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలో పని చేశానన్నారు. పదోన్నతిపై రంపచోడవరం ఉపాధిహామీ పథకంలో ఏపీడీగా ప్రభుత్వం నియమిం చిందన్నారు.

రాజవొమ్మంగి సొసైటీ అధ్యక్షుడిగా కేశవ్



రాజవొమ్మంగి సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాజవొమ్మంగి సొసైటి (పిఏసిఎస్) చైర్ పర్సన్‌గా ముప్పన డింబకేశ్వరరావు(కేశవ్) ను నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతకుముందు ఉన్న చైర్ పర్సన్ పదవీకాలం ముగియడంతో నూతన చైర్ పర్సన్‌ను, మెంబర్లుగా మద్దెసు గంగయ్య, విశంశెట్టి చిట్టమ్మలను నియమిస్తూ ఉత్తర్వులలో పేర్కొన్నారు.

రాజవొమ్మంగి ఎస్ఐగా శివకుమార్



రాజవొమ్మంగి సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాజవొమ్మంగి ఎస్ఐగా టి.శివకుమార్‌ను నియమిస్తూ జిల్లా ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు రాజవొమ్మంగి ఎస్ఐగా పనిచేసిన నరసింహమూర్తిని గుర్తేడు బదిలీ చేశారు. శివకుమార్ డొంకరాయి పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై రానున్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

మోతుగూడెం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వై.రామవరం డొంకరాయి, మంగంపాడు జీసీసీ డిపోల పరిధిలో కూటమి ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డులు పంపి ణీ కార్యక్రమం సంబంధిత జీసీసీ డిపోలకు చెందిన సేల్స్‌మెన్‌లు నైని రత్నరెడ్డి, నైని ధర్మయ్య ఆధ్వర్యంలో ప్రారంభం కాగా ఈ కార్యక్రమాన్ని స్థానిక ఎంపీటీసీ సభ్యులు కరకా వెంకట రమణ ప్రారంభించి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులు అంద జేశారు. కార్యక్రమంలో నాయకులు నీలాపు సత్యనారాయణ, గంగిరెడ్ల గురుమూర్తి, మావూరి వీర వెంకట సత్యనారాయణ, అప్పారావు, అనిల్,శివ పాల్గొన్నారు

చెత్త సంపద కేంద్రాల తనిఖీ

వై.రామవరం, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి):మండల ఎగువ ప్రాంతాలైన తుంపవలస, ఇర్లవాడ తదితర గ్రామాలలో గురువారం ఎంపీడీవో బాపన్న దొర పర్యటించారు. చెత్త సంపద కేంద్రాలను తనిఖీ చేసి పారిశుధ్య చర్యలపై సిబ్బందికి సూచనలిచ్చారు. ఇర్లవాడ జీపీఎస్ పాఠశాల, దార్లగడ్డ ఆశ్రమ పాఠశాల లు సందర్శించి విద్యార్థుల హాజరు, వసతి సౌకర్యాలను పరిశీలించారు. గుర్తేడు, పాతకోట గ్రామాలలో ఆదికర్మ యోగి అభియాన్ కార్యక్రమాల్లో పాల్గొని గ్రామాల్లో నెలకొన్న పలు ప్రజా అవసరాలను గుర్తించారు. ఉపాధి హామీ, నీతి ఆయోగ్ ఏబీఎఫ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'ఆదివాసీ సంక్షేమ పరిషత్‌పై ఆరోపణలు సరికాదు'



మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను

రంపచోడవరం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ సమాజం కోసం అనునిత్యం పోరాడుతున్న ఆదివాసీ సంక్షేమ పరిషత్‌పై తప్పడు ఆరోపణ చేయడం సరికాదని ఆదివాసీ సంక్షేమపరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను అన్నారు. గురువారం నరసాపురంలో క్వారీ వలన నష్టపోతున్న బాధితులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కుం జా శ్రీను మాట్లాడుతూ క్వారీ వలన నష్టపోతున్న బాధితులు తమను ఆశ్ర యిస్తేనే క్వారీ అక్రమాలు, జరుగుతున్న నష్టంపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరినట్టు తెలిపారు. క్వారీ నిధులు గ్రామంలోని కొంతమంది అనుభవిస్తూ వారి తప్పులను కప్పిపు చ్చుకోవడం కోసం సంఘంపై బురద చల్లడం సరికాదన్నారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తీగల బాబురావు, డివిజన్ కోఆర్డినేటర్ పీత ప్రసాద్, బాధితులు పాల్గొన్నారు.

బాధితులకు నిత్యావసరాలు అందించాలి: ధనలక్ష్మి

రాజవొమ్మంగి సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాజవొమ్మంగి మండలంలోని లబ్బర్తి, లాగరాయి, కింద్ర గ్రామాలలో ప్రజలు అనారోగ్యంతో గత మూడు నెలలుగా మంచం పట్టిన విషయం, బుధవారం ఓ మహిళ మృతి చెందిన విషయం తెలిసిందే. మృతిరాలి కుటుంబ సభ్యులను గురువారం మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులకు 10వేల రూపాయలను అందించారు. కింద్ర గ్రామంలో పర్యటించి అనారోగ్యానికి గల కారణలను అడిగి తెలుసుకున్నారు. జ్వరాలతో మంచం పట్టిన వారి ఇళ్లకు వెళ్లి వారితో మాట్లడారు. వారికి అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. అనంతరం పాత్రికేయులతో మాట్లడుతూ అధికారులు బాధిత కుటుంబాలను వెంటనే ఆదుకోవాలని, ప్రతి కుటుంబానికి రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేయాలని డిమాండ్ చేశారు. ఆమెతో ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, వైసీపీ మండలాధ్యక్షుడు సింగిరెడ్డి రామకృష్ణ, వైసీపీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి కొంగర మురళీకృష్ణ, తదితర నాయకులు ఉన్నారు.



కింద్ర గ్రామంలో పసికందును ఎత్తుకున్న మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి

తాళ్లూరు ఎత్తిపోతల పథకానికి ఆమోదం

• ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): తాళ్లూరు ఎత్తిపోతల పథకానికి ఐరన్ పైపులైన్ నిర్మాణం కోసం రూ.52కోట్లు పరిపాలన ఆమోదం లభించిందని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. జగ్గంపేట రావులమ్మనగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాళ్లూరు లిఫ్ట్ ప్రధాన కాలువవద్ద 45.195 కిలోమీటర్ల పంపు వద్ద ఉన్న పీఎస్‌సీ ప్రెజర్ మెయిన్‌ను ఎంఎస్ ప్రెజర్ మెయిన్‌తో భర్తీ చేయడానికి పరిపాలన ఆమోదంతో కూడిన ఉత్తర్వులు జారీ అయ్యాయన్నారు. మల్లవరం ఎత్తిపోతల పథకానికి కూడా త్వరలో నే పరిపాలన అనుమతి వస్తుం దన్నారు. నేపాల్ అల్లర్ల నేపథ్యంలో అక్కడ చిక్కుకున్న మన రాష్ట్ర ప్రజల కోసం మంత్రి నారా లోకేశ్ కృషి అభినందనీయమని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ వ్యాఖ్యానించారు. సూపర్‌సిక్స్ విజయోత్సవ సభ జరుగుతుంటే నేపాల్‌లో చిక్కుకున్న మన వారి కోసం మంత్రి లోకేశ్ కంట్రోల్ రూమ్‌ను పర్యవేక్షించారన్నారు. సీఎం చంద్రబాబుపై జగన్ చేసిన వ్యాఖ్యలపై సుమో టాగా కేసు నమోదు చేసి విచారణ చేయాలని ఎమ్మెల్యే నెహ్రూ డిమాండ్ చేశారు. టీడీపీ నేతలు ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, కొత్త కొండబాబు, సూరిబాబు, తాతాజీ పాల్గొన్నారు.



తాళ్లూరు ఎత్తిపోతల పథకానికి పరిపాలన అనుమతుల మంజూరు పత్రాన్ని చూపిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

మంత్రి లోకేశ్ కృషి అభినందనీయం

• ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ



ప్రత్తిపాడు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి):నేపాల్‌లో చిక్కుకున్న రాష్ట్ర ప్రజలకు విద్యా, ఐటీ, సాంకేతిక శాఖా మంత్రి నారా లోకేష్ అండగా నిలిచారని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అభినందించారు. గురువారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నేపాల్ దేశంలో నేపాల్‌లో చిక్కుకున్న 215మంది తెలుగు వారిని సురక్షితంగా తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకునా రన్నారు.

జాతీయ కన్వెన్షన్‌లో 'ఆదిత్య' ప్రోఛాన్సలర్

గండేపల్లి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆదిత్య విశ్వవిద్యాలయం ప్రో-ఛాన్సలర్ డాక్టర్ సతీష్‌రెడ్డి ప్రతిష్టాత్మకమైన అఖిల భారత మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ఏఐఎంఏ) 52వ జాతీయ మేనేజ్‌మెంట్ కన్వెన్షన్‌లో నిర్వహించిన ప్లీనరీ సెషన్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం న్యూఢిల్లీలోని తాజ్ ప్యాలెస్‌లో జరిగింది. ఈ ప్లీనరీ సెషన్‌లో పారిశ్రామిక, విద్యారంగానికి చెందిన ప్రముఖులు మేనేజ్‌మెంట్, వ్యాపారరంగాల్లో జరుగుతున్న పరిణామాలపై చర్చించారు. ఈ వేదికపై డాక్టర్ సతీష్‌రెడ్డి పారిశ్రామిక, వ్యాపార దిగ్గజాలతో కలిసి పాల్గొని భవిష్యత్ నిపుణులను తీర్చిదిద్దడంలో ఉన్నత విద్యాసంస్థల పాత్రపై ఆలోచింపజేసే అభిప్రాయాలను పంచుకున్నారు.

'దుండగులను కఠినంగా శిక్షించాలి'

జగ్గంపేట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): గోకవరంలో యువతిపై అత్యాచారం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ రామవరం గ్రామ పంచాయతీ రంగవల్లినగర్‌లో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు ఆధ్వర్యంలో గురువారం నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన చాలాదుర్మార్గమైనదన్నారు. సోమరాజు, శివ, దుర్గ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలపై రాష్ట్రవ్యాప్త నిరసన

గండేపల్లి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను 15రోజుల్లోగా పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్త నిరసన కార్యక్రమాలు చేపడతామని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఎంపీడీవోకి వినతిపత్రం అందించారు. సంఘం ప్రధాన కార్యదర్శి బి.జాన్ క్రిస్టోఫర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గ్రామ,వార్డు సచివాలయ ఉద్యోగులు ప్రతిసారి ఇంటింటికీ తిరిగి విధులు నిర్వహించడం, క్షేత్రస్థాయిలో తీవ్ర అవమానాలకు గురికావడంతోపాటు ఉద్యోగుల ఆత్మగౌరవానికి భంగం వాటిల్లుతుందనే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, రాజేష్, పి.సతీష్, మండల నాయకులు కంటిపూడి రఘు, పి.గోపి, కరీం పాల్గొన్నారు.

పోతుల మోహన్‌రావుకు పలువురి అభినందన



పోతుల మోహన్‌రావును సత్కరిస్తున్న దృశ్యం

గండేపల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని సింగరాయపాలేనికి చెందిన టీడీపీ మండల అధ్యక్షుడు పోతుల మోహన్‌రావును కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపిక చేయడంతో గురువారం ఆయన్ను కలిసి పలువురు అభినందనలు తెలిపారు. మల్లేపల్లి సొసైటీ అధ్యక్షుడు దిడ్డి శీను, టీడీపీ అధ్యక్షుడు తెలగరెడ్డి భద్రరావు ఆయన్ను సత్కరించారు.

సీఆర్‌ఎంటీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి

ప్రత్తిపాడు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): సీఆర్‌ఎంటీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని రాష్ట్ర సమగ్రశిక్ష డైరెక్టర్ బి.శ్రీనివాసరావుకు సీఆర్‌ఎంటీల రాష్ట్ర అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. గురువారం అన్నవరం దైవ దర్శనానికి విచ్చేసిన రాష్ట్ర సమగ్ర శిక్ష డైరెక్టర్ బి.శ్రీనివాసరావుకు ఏపీ సీఆర్‌పీడబ్ల్యూఏ రాష్ట్ర అధ్యక్షుడు ఎలిపే రాంజీప్రసాద్, నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2011లో వచ్చిన సీఆర్‌ఎంటీల వ్యవస్థ 14 సంవత్సరాలు గడిచినా సీఆర్‌ఎంటీలకు ఉద్యోగభద్రత కల్పించలేదన్నారు. కార్యక్రమంలో ఏపీ సీఆర్‌పీడబ్ల్యూఏ అసోసియేషన్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

కన్నబాబును కలిసిన వర్తకసంఘ నాయకులు



వర్తక సంఘం నాయకులతో సమావేశమైన కన్నబాబు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి):ఏపీ ఖాదీ విలేజ్ ఇండస్ట్రీ బోర్డు డైరెక్టర్‌గా నియమితులైన ప్రత్తిపాడుకు చెందిన కొమ్ముల కన్నబాబును స్థానికవర్తక సంఘ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఖాదీ బోర్డు డైరెక్టర్‌గా కన్నబాబు నియమితులవడం వల్ల ఈ ప్రాంతానికి ఎంతో మేలు చేకూరుతుందని వర్తక సంఘ నాయకులు అనంతపల్లి శ్రీను, హరేరాం, సురేష్, కోటిపల్లి శ్రీనివాస్, భద్రరావు, చామంతి కృష్ణమోహన్ తదితరులు తెలిపారు. ఈ సమావేశంలో వ్యాపారవేత్తలు ముత్యాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్ల రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొనండి

ప్రత్తిపాడు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి):కాంట్రాక్ట్ లెక్చరర్ల రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొనాలని రాష్ట్ర కాంట్రాక్ట్ లెక్చరర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోర్ల మాణిక్యం కోరారు. గురువారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ కాంట్రాక్ట్ లెక్చలర్ల సర్వీస్ రెగ్యులరైజేషన్ ప్రక్రియ ప్రభుత్వం వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. 2024-2025 వేతనాలు వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ నెల 13నవిజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య భవన్‌లో నిర్వహించనున్న రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో డాక్టర్ వై. జాన్‌బాబు, కె.రత్నకుమారి, శ్యామ్ కిరణ్, ఖాదర్‌వల్లి, కాశీరత్నం, శేషగిరి, ఉమాదేవి, లత, ఊబయ్య, వేణుగోపాలరాజు తదితరులు పాల్గొన్నారు.

నరేంద్రగిరిని సందర్శించిన సీఐ అంకబాబు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి):ప్రత్తిపాడులోని నరేంద్రగిరి కొండపై ఉన్న స్వామి వివేకానందవిగ్రహ ప్రదేశాన్ని గురువారం పెద్దాపురం క్రైం సీఐ రాజులపాటి అంకబాబు, న్యాయవాది శివ, నరేంద్రగిరి ఉప కోశాధికారి రేపాక ప్రసాద్, కార్యదర్శి సింగిలిదేవ్ సత్తిరాజు బృందం సందర్శించింది. కార్యక్రమంలో రాయుడు రాము, నందిపాటి సిద్దార్థ, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎరుకంపాలెంలో భారీ అన్నదానం

ప్రత్తిపాడు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి):మండలంలోని గోకవరం-మెట్టిచింత గ్రామాల మధ్య గల ఎరుకంపాలెం వినాయకుని ఆలయం వద్ద గురువారం భారీ అన్నదానం నిర్వహించారు. టీడీపీ నాయకుడు యర్రాబత్తుల గోవిందనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అన్నదాన కార్యక్రమంలో ఖాదీ బోర్డు డైరెక్టర్ కొమ్ముల కన్నబాబు, సుబ్బారెడ్డి సాగర్ చైర్మన్ ఇళ్ళ అప్పారావు, కె.శ్రీనివాస్, నిమ్మల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



ఉద్యమ ఆధార్ సర్టిఫికెట్ అందిస్తున్న సందీప్

మహిళా చిరు వ్యాపారులకు ఉద్యమ ఆధార్‌తో ప్రయోజనం

తొండంగి, సెప్టెంబరు 11(ఆంధ్రజోతి): మహిళా చిరు వ్యాపారులకు ఉద్యమ ఆధార్ సర్టిఫికెట్ ప్రయోజనకారిగా ఉంటుందని జిల్లా పరిశ్రమల కేంద్ర ప్రమోషన్ అధికారి సందీప్ అన్నారు. తొండంగి వెలుగు కార్యాలయంలో గురువారం ఉద్యమ ఆధార్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. మహిళా సంఘాల్లో సభ్యులై ఉండి చిన్న వ్యాపారాలు చేసుకుంటున్న వారికి భవిష్యత్తులో వివిధ పథకాల ద్వారా సహాయం పొందేందుకు ఉద్యమ ఆధార్ సర్టిఫికెట్ తప్పనిసరి అన్నారు. వెలుగు కార్యాలయంలో దీని రిజిస్ట్రేషన్ ప్రారంభించామన్నారు. దీనికి ఆధార్, పాన్‌తోపాటు బ్యాంకు అకౌంట్‌కు లింకైన మొబైల్ ఫోన్‌తో హాజరైతే రిజిస్ట్రేషన్ చేస్తారన్నారు. కార్యక్రమంలో బీమా కాల్ సెంటర్ అధికారి అనిల్, నాన్ పార్మా ఏపీఎం విజయలక్ష్మి, మండల ఏపీఎం సుశి సౌభాగ్యవతి సీసీలు పాల్గొన్నారు.

దత్తత కుటుంబానికి నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న దృశ్యం

తుని రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎస్.అన్నవరంలో ఒక కుటుంబాన్ని పీ4 కుటుంబాల జాబితాలో దత్తత తీసుకున్న తుని నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఎస్.శ్రీధర్ గురువారం వారికి నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ మేరకు కీర్తి చంద్రమ్మ కుటుంబానికి ఎంపీడీవో నెలవారీ నిత్యావసర సరుకులు, సైకిల్ అందజేశారు.

రాజపూడిలో ఉద్యానవనశాఖ అవగాహన సదస్సు

జగ్గంపేట రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజపూడిలో ఉద్యానశాఖ మామిడి, జీడీమామిడి, తేనెటీగల పెంపకంలో శాస్త్రీయ పంట నిర్వహణ పద్ధతులపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించింది. కార్యక్రమంలో రైతులకు ఉద్యాన పంటలపై తెగుళ్ల నియంత్రణ, వ్యాధి నిర్వహణ, పండ్ల తోటల ఆరోగ్యంకోసం మెరుగైన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు. కలవచర్లలోని కేవీకేనుంచి సబ్జెక్ట్ మేటర్ స్పెషలిస్ట్ రఘునందన్ మామిడి, జీడిమామిడి పంటల్లో వచ్చే తెగుళ్లపై రైతులకు వివరించారు. ప్రగతిశీల తేనెటీగల పెంపకందారుడు రామరాజు ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. కార్యక్రమంలో ఉద్యానఅధికారి, ఏ.శ్రీవల్లి, సర్పంచ్ భూశాల విష్ణు మూర్తి, సొసైటీ చైర్మన్ ఉప్పలపాటి వెంకటేశ్వరరావు, గ్రామ ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.